ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
శుక్రవారం 7 మార్చి 2025

- 9న అంకురార్పణ.. 20న తేరు
- బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన స్వామి
- పక్షం రోజులు కదిరిలో సందడే సందడి

ఖాద్రీశుడి సంబరం 6



టెన్షన్... టెన్షన్..!

- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవిపై ఆశలు
- ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యంపై సందేహాలు
- సామాజిక సమతౌల్యం ఒక్కటే ఆటంకం
- త్యాగాలు చేసినవారికి చాన్స్ ఇస్తారా..?
- అభ్యర్థుల ప్రకటన శనివారం..? 6



కట్టు తప్పుతున్నారు..!

- వాటాల కోసం కొందరు కూటమి నాయకుల వెంపర్లాట
- పెనుకొండ వద్ద అలజడులు
- మొన్న మిక్చర్‌ప్లాంట్, నిన్న భూముల వ్యవహారం.. తాజాగా లారీలకు గాలితీసిన వైనం
- పారిశ్రామికాభివృద్ధికి విఘాతమన్న విమర్శలు



హిందూపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో పెనుకొండ వద్ద కియ కార్ల పరిశ్రమ, అనుబంధ సంస్థల ఏర్పాటుకు సీఎం చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేశారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలతో పోటీపడి పరిశ్రమను సాధించారు. జెట్ స్పీడుతో ఏర్పాటు చేయించారు. యుద్ధప్రాతిపదికన గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మించి నీరు ఇచ్చారు. అలా.. కరువు నేలపై కార్ల పంట పండించారు. తర్వాత పలు అనుబంధ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వెరసి, పెనుకొండ కార్ల హబ్‌గా పేరొందింది. తద్వారా వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతోంది. పరిశ్రమల ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోయాయి. మరింత అభివృద్ధి చెందుతున్న తరుణంలో 2019లో వైసీపీ అధికారం చేపట్టింది. వాటాలు, కమీషన్ల కోసం ఆ పార్టీ నేతలు బెదిరింపులకు దిగడంతో పెనుకొండ వద్ద ఏర్పాటు కావాల్సిన పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయి. అలా.. పెనుకొండ వద్ద పారిశ్రామికాభివృద్ధి ఆగిపోయింది. గతేడాది ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పెనుకొండ వద్ద పారిశ్రామికాభివృద్ధి మళ్లీ పట్టాలెక్కింది. పరిశ్రమలు ఒక్కొక్కటిగా వస్తున్నాయి. ఈ తరుణంలో కొందరు కూటమి నాయకుల తీరు వివాదాస్పదమవుతోంది. విమర్శలకు తావిస్తోంది. వాటాల కోసం పాకులాడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాటాలు, కమీషన్లు ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగుతున్నారు. క్రమశిక్షణ లోపించి, వ్యవహరిస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు.



లారీ టైరుకు గాలి తీసేసిన దృశ్యం

వాటాల కోసం..

గత వైసీపీ హయాంలో వేలాది మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలు ఆ పార్టీ నాయకుల బెదిరింపుల కారణంగా పక్క రాష్ట్రాలకు పరుగులు తీశాయి. దీంతో కూటమి వచ్చాక రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకు రావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కష్టపడుతున్నారు. ఒక్క పరిశ్రమ వస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. అక్కడున్న వారు కూడా ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి దొరుకుతుంది. దీంతో పరిశ్రమ తీసుకు రావడానికి ప్రభుత్వ పెద్దలు శ్రమిస్తున్నారు. కొన్నిచోట్ల పరిశ్రమల వద్ద అలజడి సృష్టించడానికి వైసీపీ నాయకుల ముసుగులో కొంతమంది కూటమి నేతలు కుట్రలు పన్నుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకప్పుడు అధికారం చేపట్టిన పార్టీ నాయకులు తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకునే పనిలో బిజీ అయ్యేవారు. ప్రస్తుతం నాయకుల తీరు మారిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అభివృద్ధి విషయం పక్కనబెట్టారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్వార్థం కోసమే ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నారు. 'అధికారంలోకి వచ్చాం, మేమేం సంపాదన చేయాలో చెప్పాలంటూ బహిరంగంగా అడుగుతున్నా'రు. వారి తీరుతో సీనియర్ నాయకులు నివ్వెరపోతున్నారు. తమ హయాంలో అభివృద్ధి కోసం అడిగే నాయకులు.. ప్రస్తుతం సొంత ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారు. దీంతో కియ వద్ద కొంతమంది కూటమి నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం బరితెగిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని లాభదాయక పనుల్లో కూటమి నాయకులు పాలుపంచుకున్నట్లు సమాచారం. అధికార పార్టీ నాయకులు చేస్తున్న కొన్ని వ్యవహారాలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఉన్నాయని కూటమి నాయకులే వాపోతున్నారు.



రెండు నెలల క్రితం గొడవ జరిగిన కంకర మిక్చర్ ప్లాంట్

ఇవీ.. ఘటనలు...

రెండు నెలల క్రితం కియ పరిశ్రమ వద్దగల కంకర మిక్చర్‌ప్లాంట్ వద్దకు సమీప గ్రామానికి చెందిన కొందరు వచ్చి అడ్డుకున్నారు. ఈ మిక్చర్‌ప్లాంట్ వైసీపీ హయాం నుంచి ఉంది. అప్పట్లో సజావుగా సాగింది. కూటమి అధికారం చేపట్టాక అందులో వాటాల కోసమని స్థానికంగా ఉండే అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించి, మూతవేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని సమస్య సద్దుమణిగించారు. మిక్చర్‌ప్లాంట్ నిర్వాహకుడు... అధికార పార్టీకి చెందిన నాయకుడికి లీజుకు ఇవ్వడంతో అప్పటి నుంచి సజావుగా సాగుతోంది. ఇదే ప్లాంట్ విషయంలో ఓ శాఖకు చెందిన అధికారులు.. కూటమి నేతల వద్ద నలిగిపోయారు. విషయం అధిష్టానం దృష్టికి వెళ్తుందని భావించిన ముఖ్య నేతలు మిన్నకుండిపోయినట్లు తెలిసింది. గత నెలలో కియ పరిశ్రమ సమీపాన భూమి విషయమై ఘర్షణకు దిగారు. గొడవ తారస్థాయికి చేరింది. ఇరువర్గాల వారు.. కియ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసుకున్నారు. సమస్య నేటికీ పరిష్కారం కాలేదు. తాజాగా సోమందేపల్లి మండలంలోని చాలకూరు వద్ద కియ అనుబంధ పరిశ్రమ సమీపంలో స్థానిక టీడీపీ నాయకులు తమ టిప్పర్లు, లారీలే పెట్టుకోవాలనీ, ఇతరుల వాహనాలు ఉండడానికి వీలులేదంటూ హుకుం జారీ చేశారు. లోడింగ్‌కు వెళ్లిన లారీ టైర్లకు గాలి తీసేశారు. దీంతో లారీ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోషల్ మీడియాలో ఆడియో విడుదల చేశారు. అక్కడ కూడా అధికార పార్టీ నాయకులు దౌర్జన్యం చేయడం సరికాదని అందులో ప్రశ్నించారు. మరికొన్ని వ్యవహారాలు బయటకు పొక్కకుండా చేసినట్లు సమాచారం. ఇప్పటికైనా ఈ తీరులో మార్పు రాకపోతే.. పారిశ్రామికాభివృద్ధికి విఘాతం తప్పదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రాణం తీసిన ట్రిపుల్ వేగం

- అర్ధరాత్రి మద్యం సేవించి బైక్ రైడింగ్
- రోడ్డు పక్కన ఇద్దరిని.. డివైడర్‌ను ఢీకొట్టి..
- యువకుడి మృతి.. నలుగురికి తీవ్రగాయాలు



మనోజ్ (ఫైల్)

పెనుకొండ రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తు, అర్ధరాత్రి ట్రిపుల్ రైడింగ్, అతివేగం ఒక నిండు ప్రాణాన్ని తీశాయి. నలుగురిని తీవ్రంగా గాయపరిచాయి. పెనుకొండ మండల పరిధిలోని పులేకమ్మ దిన్నె వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు సోమందేపల్లికి చెందిన మనోజ్(23), ప్రేమ్‌కుమార్, హర్షవర్ధన్ మద్యం సేవించి అర్ధరాత్రి ద్విచక్రవాహనంలో కియ వైపు బయలుదేరారు. ఇదే మార్గంలో, చిక్కబళ్లాపురం నుంచి అనంతపురం వైపు వెళ్తున్న ఓ కారు బ్రేక్‌డౌన్ అయింది. దీంతో ఆర్టీఓ చెక్‌పోస్టు వద్ద 44వ జాతీయ రహదారి పక్కన పార్కింగ్ లైటు వేసి ఆపి ఉంచారు. చిక్కబళ్లాపూర్‌కు చెందిన డ్రైవర్ శివకుమార్, మరో వ్యక్తి కార్తీక్ కారు వద్ద నిలబడి సాయంకోసం ప్రయత్నిస్తున్నారు. బైక్‌పై వేగంగా వచ్చిన ముగ్గురు యువకులు శివకుమార్, కార్తీక్‌ను ఢీకొట్టి.. ఆ తరువాత పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మనోజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. హర్షవర్ధన్, ప్రేమ్‌కుమార్, కారు డ్రైవర్ శివకుమార్, కార్తీక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులను ఆస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైద్యుడు లేని వైద్యం..!

104కి డాక్టర్ డుమ్మా... సిబ్బంది వైద్యం

'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో బట్టబయలు



గేమేనాయక్ తండా బస్టాండ్‌లో ఉన్న 104 సిబ్బంది, వాహనం

ఆంధ్రజ్యోతి విజిట్

తనకల్లు/కదిరి మార్చి6(ఆంధ్రజ్యోతి): 104 వైద్య సేవలపై 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో చేపట్టిన విజిట్‌లో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. 104 వాహనం వెంట రావాల్సిన వైద్యుడు డుమ్మాకొట్టాడు. దీంతో సిబ్బందే రోగులకు వచ్చీరాని వైద్యం చేశారు. మందులు అందించారు. తనకల్లు మండలంలోని గేమేనాయక్ తండాలో గురువారం మధ్యాహ్నం గ్రామస్థులకు వైద్యసేవలందించడానికి 104 వాహనం వచ్చింది. గ్రామీణులకు 104 ద్వారా వైద్యసేవలు అందించడానికి వాహనానికి ఓ డాక్టర్‌నుకూడా నియమించారు. గేమేనాయక్ తండాలో నిర్వహించిన 104 సేవలకు డాక్టర్ డుమ్మాకొట్టారు. దీంతో 104 సేవల కోసం వచ్చిన రోగులను సూపర్‌వైజర్ సావిత్రమ్మ, ఏఎన్ఎం, సిబ్బంది పరిశీలించి, చికిత్సలు చేశారు. 20మందికి వైద్యసేవలందించినట్లు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసిన సందర్భంలో డాక్టర్ లేరు. ఆంధ్రజ్యోతి విజిట్ విషయం తెలుసుకున్న డాక్టర్ ధర్మరాజు వెంటనే ఆంధ్రజ్యోతిని ఫోన్లలో సంప్రదించారు. తాను కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ లోకేశ్వర్ రెడ్డి అనుమతితో వేరే ఊరికి వెళ్తున్నట్లు చెప్పారు. డాక్టర్ రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు.

వైభవంగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ



అయ్యప్పను దర్శించుకుంటున్న భక్తులు



స్వామివారి మూలవిరాట్

ధర్మవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్‌లో స్వరూప అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠను గురువారం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీమహాగణపతి, సుబ్రహ్మణేశ్వర, ఆదిత్యాది నవగ్రహ, ధ్వజస్తంభ, విమానగోపుర, జ్యోతిస్వరూప అయ్యప్పస్వామి మూలవిరాట్‌లను ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు చేశారు. అన్నమయ్య సేవామండలి ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు.

ఉష్ణోగ్రతలు



గురువారం

గరిష్ఠం	36.0
కనిష్ఠం	20.0



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.32 శుక్రవారం సాయంత్రం	5.10 శనివారం ఉదయం
కదిరి	6.29 శుక్రవారం సాయంత్రం	5.14 శనివారం ఉదయం
ధర్మవరం	6.32 శుక్రవారం సాయంత్రం	5.10 శనివారం ఉదయం
హిందూపురం	6.32 శుక్రవారం సాయంత్రం	5.18 శనివారం ఉదయం
పెనుకొండ	6.32 శుక్రవారం సాయంత్రం	5.18 శనివారం ఉదయం

సవాళ్లను అధిగమిస్తేనే సాధికారత: ఎస్పీ



లింగ వివక్షపై పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో మహిళలు సాధికారత సాధించాలంటే సవాళ్లను సమర్థవంతంగా అధిగమించాలని జిల్లా ఎస్పీ రత్న ఉద్ఘాటించారు. 8న జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక సాయిఆరామంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, ఆదినారాయణ ఆధ్వర్యంలో 'మహిళా సాధికారత-సవాళ్లు-పరిష్కారాలు' అనే అంశంపై గురువారం జిల్లాస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఎస్పీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళలు తమను తాము నిరూపించుకోవాలని తలెత్తుకుని బయటకు వస్తారో అక్కడి నుంచి అనేక ఆటంకాలు ఎదురవుతాయన్నారు. వాటన్నింటినీ సవాళ్లుగా మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఎస్పీ అభిప్రాయపడ్డారు. అనంతరం బాల్యవివాహాలు, లింగ వివక్షపై పోస్టర్లను ఎస్పీ విడుదల చేశారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన ఐదుగురు మహిళలను సత్కరించారు, ఆర్డీటీ సహకారంతో 52 మంది ఒంటరి మహిళలకు నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ ప్రమీలాకుమారి, మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చిత్తడి నేలలను పరిరక్షించుకోవాలి

కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, మార్చి6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చిత్తడి నేలలను పరిరక్షించుకోవడానికి అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. స్థానిక కలెక్టర్‌లోని సమావేశ భవనంలో 'చిత్తడి భూముల పరిరక్షణ, నిర్వాహణ' అనే అంశంపై గురువారం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్ఏసీ) నివేదిక ప్రకారం జిల్లాలో 1,340 చోట్ల చిత్తడి నేలలున్నాయన్నారు. మండలాల వారీగా చిత్తడి నేలలను గుర్తించి, పరిరక్షించాల్సిన బాధ్యత ఆయాశాఖల అధికారులపై ఉందన్నారు. ఇందుకోసం మండలస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, జిల్లా అటవీ శాఖాధికారి చక్రపాణి, ఆర్డీవోలు సువర్ణ, వీవీఎస్ శర్మ, ఆనంద్, మహేష్, డీపీఓ సమత, సర్వే ఏడీ విజయశాంతి, అటవీ అధికారులు సరస్వతి, గుర్రప్ప, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని వాల్మీకి బోయలను ఎస్టీజాబితాలో చేర్చాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం శాసనసభలో జీరో అవర్‌లో ఎమ్మెల్యే ఈ అంశాన్ని ప్రస్తావించారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉన్నందున వాల్మీకి బోయలను ఎస్టీజాబితాలో చేర్చేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలోని తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాలు, పక్కరాష్ట్రమైన కర్ణాటకలో వాల్మీకులు ఎస్టీ జాబితాలో ఉన్నారన్నారు. దీనికి మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలోకి చేర్చేవిధంగా కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు.

నీటి తొట్టెలో పడి బాలుడి మృతి



బాలుడి మృతదేహం వద్ద విలపిస్తున్న నానమ్మ అంజినమ్మ

ఓబుళదేవరచెరువు, మార్చి6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమారెడ్డిపల్లికి చెందిన బండి గంగరాజు ఏకైక కుమారుడు ద్వారకానాథ్(4) గురువారం నీటి తొట్టెలో పడి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బాలుడు తండ్రి గంగరాజు తిరుపతిలో ఎలక్ట్రీషియన్‌గా, తల్లి రాధిక గార్మెంట్ పనికి వెళ్తుంటారు. బాలుడు ద్వారనాథ్.. నానమ్మ, తాత వద్ద ఉంటున్నాడు. తాత పశువుల మేతకు గడ్డి తెచ్చేందుకు వెళ్లగా.. నానమ్మ ఇంట్లో పని చేసుకుంటోంది. బాలుడు ఆడుకుంటూ వెళ్లి ఇంటి వెనుక పశువుల నీటి కోసం ఏర్పాటుచేసిన తొట్టెలో పడ్డాడు. కాసేపటికి గమనించిన చుట్టుపక్కల వారు కేకలు వేసి, బాలుడిని బయటకు తీశారు. కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి మృతదేహం వద్ద నానమ్మ అంజినమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. ఘటనాస్థలాన్ని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పరిశీలించి, విచారించారు.

గణిత పరీక్షకు 551 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం గణిత పరీక్షకు 551 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ రఘునాథరెడ్డి ప్రకటనలో తెలిపారు. జనరల్‌లో మొత్తం 12,437 మందికిగాను 11,985 మంది పరీక్షలు రాయగా.. 452 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ పరీక్ష 1,644 మందికిగాను 1,545 మంది రాయగా.. 99 మంది గైర్హాజరయ్యారయ్యారని వివరించారు.

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వేళైంది. ఏటా పాల్గుణ మాసంలో పక్షం రోజుల రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు మంగళవారం అంకురార్పణ జరగనుంది. బ్రహ్మోత్సవాలను సాక్షాత్తు బ్రహ్మదేవుడు ముందుండి నడిపిస్తారని భక్తుల విశ్వాసం. ఈ నెల 9న ప్రారంభమయ్యే వేడుకలు 23న ముగుస్తాయి. శ్రీవారు రోజుకో అవతారంలో భక్తులను అనుగ్రహిస్తారు.

-ఆంధ్రజ్యోతి, కదిరి

ఖాద్రీశుడి సంబరం



ఖాద్రీ లక్ష్మీనరసింహా స్వామి

ముహూర్తాలు బంద్



ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం జరిగిన నాటి నుంచి ఈ ప్రాంతంలో వివాహాలను నిర్వహించరు. ఎందుకు అని ప్రశ్నిస్తే.. 'నారసింహుడి కల్యాణానికి ఎదురు కళ్యాణమా?' అని బదులిస్తారు. అందుకే ముహూర్త బలాలు ఎలా ఉన్నా, బ్రహ్మోత్సవాలు ముగిసేవరకూ ఎవరూ వివాహం చేసుకోరు. స్వామివారి కల్యాణం తరువాతే తమ కల్యాణం గురించి ఆలోచిస్తారు. నారసింహుడిని ఇలవేల్పుగా కొలిచేవారు ఈ పక్షం రోజులపాటు మాంసాహారానికి దూరంగా ఉంటారు.

కదిరి మల్లెల పరిమళాలు



కదిరి మల్లెలకు దేశంలోనే పేరుంది. ఇక్కడి మల్లెల పరిమళం మరే ప్రాంతంలోనూ కనిపించదంటారు. ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాల సమయానికి విరబూసే మల్లెలు మరింతగా గుభాలిస్తాయి. ఇక ఈ ప్రాంతంలో మాత్రమే కన్పించే దవణం, మరువం సౌరభాలు ఖాద్రీశుడికి ఎంతో ప్రీతిపాత్రం. బ్రహ్మరథంలో ఊరేగే శ్రీవారికి దవణాన్ని మొక్కుబడిగా సమర్పిస్తారు. ఇటీవలి కాలంలో కదిరి దవణాన్ని సెంటు, అత్తరు తయారీలో వినియోగిస్తున్నారు.

మూల విరాట్టు... ప్రత్యేకం

కదిరి నారసింహుడు స్వయంభువు. శ్రీవారు ప్రహ్లాద సమేతుడై గర్భాలయంలో కొలువుదీరారు. అష్టభుజుడైన నారసింహుడు దుష్టరాక్షసుడైన హిరణ్యకశపుడిని తన తొడలపై పరుండబెట్టుకుని.. గోళ్లతో వక్షస్థలాన్ని చీలుస్తూ కనిపిస్తారు. నాలుగు హస్తాలలో శంకు, చక్ర, ఖేడ్య, ఖడ్గములను ధరించి ఉంటారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు శ్రీవారి గర్భాలయానికి ఎడమ భాగాన, మరో ఆలయంలో కొలువుదీరి ఉన్నారు. నిత్యం అభిషేకం అనంతరం శ్రీవారి వక్ష స్థలం నుంచి స్వేద బిందువులు ఉద్భవించడం. మూల విరాట్టు ప్రత్యేకత.



ప్రహ్లాదుల మూల విరాట్టు

9న అంకురార్పణ..
20న తేరు..
బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన స్వామి
పక్షం రోజులు కదిరిలో సందడే సందడి

ఖాద్రి అంటే..

శ్రీమహావిష్ణువు దశావతారాల్లో ఒకటి నారసింహావతారం. కదిరి పట్టణ పూర్వ నామం ఖాద్రీపురం. ఖ అంటే విష్ణు పాదం అని, 'ద్రి' అంటే కొండ అని అర్థం. నారసింహుడు ఈ ప్రాంతంలో పాదం మోపినందున ఖాద్రి అన్న పేరు వచ్చిందని చెబుతారు. ఇదికాక మరో పురాణ గాథ ప్రచారంలో ఉంది. 'ఖదిర' అనే పేరుగల చంద్ర వృక్షం నుంచి నారసింహుడు ఉద్భవించినందున ఈ క్షేత్రానికి ఖాద్రి అన్న పేరు వచ్చిందని అంటారు. కృతయుగంలో ఉద్భవించిన లక్ష్మీనరసింహుడి కోసం పట్నం పాలేగాళ్లు 10వ శతాబ్దానికి ముందే ఆలయాన్ని నిర్మించినట్లు ఆనవాళ్ళు ఉన్నాయి. ప్రస్తుతం నారసింహుడి ఆలయం ఉన్న చోట 10వ శతాబ్దం మధ్య కాలంలో పశ్చిమ చాళుక్య రాజవంశీయులు దుర్గాదేవి ఆలయాన్ని నిర్మించారు. భృగుతీర్థంలో మునిగి ఉన్న ఉత్సవ మూర్తులను వసంత రుతువులో వెలికి తీసి ప్రతిష్ఠించడం వలన శ్రీవారిని వసంత వల్లభుడు అని కూడా పిలుస్తారు. మహాభక్తులైన 12 మంది ఆళ్వార్‌లు రంగ మంటపాన్ని, కొక్కంటి పాలెగాళ్ళు పడమర గోపురాన్ని, తాడిపత్రి పాలెగాళ్ళు కొటాయి మంటపాన్ని నిర్మించారు.



ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం తూర్పు పడమర, ఉత్తరం, దక్షిణ గోపురాలు

చూడండి.. కనులారా..

ఖాద్రీ లక్ష్మీనారసింహుడిని దర్శించుకున్న అనంతరం భక్తులు దర్శించుకోవాల్సిన క్షేత్రాలు ఈ ప్రాంతంలో చాలా ఉన్నాయి. కదిరి, రాయచోటి మార్గంలో 12 కి.మీ. దూరంలో గాండ్లపెంట మండలం, కటారుపల్లిలోని యోగివేమన ఆలయం ఉంది. అత్యంత విశాలమైన వటవృక్షంగా గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కిన తిమ్మమ్మ మర్రిమాను కూడా ఇదే మార్గంలో నంబులపూలకుంట మండలం గూటిబైలు వద్ద ఉంది. కదిరి- హిందూపురం రహదారిలో పాలబావి ఉంది. ఎంత కరువు వచ్చినా ఈ బావిలో నీరు ఇంకిపోదు. మండుటెండలో సైతం పొంగిపొర్లడం దీని ప్రత్యేకత. నల్లచెరువు మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ప్రమాణాలకు పేరు.

అంకురార్పణతో మొదలు

పదిహేను రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో మొదలై తీర్థవాదితో ముగుస్తాయి. కల్యాణోత్సవం నాటి నుంచి ప్రతిరోజూ ఓ ప్రత్యేక వాహనంలో తిరువీధుల్లో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ఏడాదిలో అన్నిరోజులు ఆలయంలో మాత్రమే దర్శనమిచ్చే శ్రీవారు.. భక్తుల చెంతకే వెళ్లి దర్శనమివ్వడం బ్రహ్మోత్సవాల ప్రత్యేకం. 9న అంకురార్పణం, 10న కల్యాణోత్సవం, 11న హంసవాహనం, 12 సింహ వాహనం, 13న హనుమంత వాహనం, 14న బ్రహ్మగరుడసేవ, 15న శేషవాహనం, 16న సూర్య చంద్రప్రభ, 17న మోహినీ ఉత్సవం, 18న ప్రజాగరుడ సేవ, 19న గజవాహనం, 20న బ్రహ్మరథోత్సవం(తేరు), 21 అలకోత్సవం, 22న తీర్థవాది, 23న పుష్పయాగోత్సవం నిర్వహిస్తారు.

పాప విమోచనం

ఆలయానికి పడమర భాగాన, అర్జుననది ఒడ్డున భృగుతీర్థం ఉంది. అక్కడ భృగు మహర్షి తపస్సు చేసి శ్రీవారిని స్మరించుకున్నారు. ఆ మహర్షి కోరిక మేరకు శ్రీవారు స్వయంగా శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ విగ్రహాలు అందించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఆ ఉత్సవ విగ్రహాలే ఇప్పటికీ బ్రహ్మోత్సవాల్లో తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్నాయి. భృగుతీర్థంలో స్నానం చేసి శ్రీవారిని దర్శించుకుంటే సర్వపాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం.



పాలబావి



ఆలయంలోని ధ్వజస్తంభం



మెరిసేదంతా బంగారమే!

జ్యువెలరీ షాపుల్లో మోసాలు

- రాళ్లకూ బంగారంతో సమానంగా ధరలు
- తూకాల్లోనూ తేడాలు
- వేయింగ్ మిషన్ల రెన్యువల్ ఉత్తమాటే..
- వినియోగదారులకు నిండా మోసం
- తనిఖీలు మరచిన తూనికలు, కొలతల అధికారులు



బంగారం ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఎంతదాకా పెరుగుతాయో కూడా తెలియదు. దీంతో ఇప్పుడే అంతో ఇంతో బంగారం కొనిపెట్టుకోవాలని చాలామంది ఆరాట పడుతున్నారు. జ్యువెల్లరీ షాపులకు క్యూ కడుతున్నారు. వేలు, లక్షల రూపాయలు పోసి కొన్న బంగారం స్వచ్ఛమైనదేనా, చెల్లించిన డబ్బుకు సరిపోయే తూకం నగ ఇచ్చారా? అన్నది అనుమానమే. చాలా షాపుల్లో బంగారం మాటున రకరకాల మోసాలకు పాల్పడుతున్నారు. రాళ్లతో ఉన్న బంగారు నగలను కొనుగోలు చేస్తే షాపు నిర్వాహకుడు రాళ్లు, బంగారాన్ని వేర్వేరుగా తూకం వేసి, ధర లెక్కగట్టాలి. ఎందుకంటే బంగారం, రాళ్ల ధరకు చాలా వ్యత్యాసం ఉంటుంది. అలా చేయట్లేదు. నగ మొత్తంగా తూకం వేసి బంగారంతో సమానంగా రాళ్లకూ ధర కట్టి వినియోగదారులకు అంటగడుతున్నారు. అర్హత లేని వేయింగ్ మిషన్లతో మోసం చేస్తున్నారు. వాటిని కనీసం రెన్యువల్ చేయట్లేదు. దీంతో జిల్లాలోని కొన్ని షాపుల్లో నిర్వాహకులు చెప్పిందే తూకంగా, ఇచ్చిందే బంగారంగా మారిపోయింది. తరచూ తనిఖీలు చేస్తూ ఈ మోసాలకు చెక్ పెట్టాల్సిన తూనికలు, కొలతల శాఖాధికారులు ఆ విషయాన్నే మరిచారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ శాఖను అధికారులు, సిబ్బంది కొరత కూడా వేధిస్తోందని సమాచారం. వెరసి.. పలు జ్యువెల్లరీ షాపుల్లో వినియోగదారులు మోసపోతున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్

స్వచ్ఛత సంగతేంటో..?

బంగారు నగ కొనుగోలు చేసేందుకు వెళ్తే దుకాణ నిర్వాహకుడు చెప్పిన మేరకే స్వచ్ఛత అని వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. అది 22 క్యారెట్లా, 24 అని వినియోగదారులు గుర్తించలేకపోతున్నారు. పలు దుకాణదారులు తూకాల్లో చేస్తున్న మోసాన్ని గ్రహించలేకపోతున్నారు. వినియోగదారులకు బంగారంపై ఉన్న మక్కువను క్యాష్ చేసుకుంటున్న కొందరు కేటుగాళ్లు తక్కువ తూకాలతో వారి జేబు గుల్ల చేస్తున్నారు. ఇలాంటి బంగారు దుకాణాలపై నిత్యం తనిఖీలు నిర్వహించి, చర్యలు తీసుకోవాల్సిన తూనికలు, కొలతల శాఖాధికారులు ఆ విషయాన్నే మరిచారు. ఆ శాఖలో ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది.



బంగారం దుకాణంలో నగలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

గుర్తించకపోతే అంతే...

సాధారణంగా బంగారు దుకాణాల్లో మిల్లీ గ్రాముల నుంచి వెయిట్ చూపించే యంత్రాలుండాలి. అలాంటివి జిల్లాలో అతి తక్కువ దుకాణాల్లో మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఫలితంగా చిన్నపాటి బంగారు నగలు కొనుగోలు చేసే వినియోగదారులు మోసపోతున్నారు. మెజార్టీ దుకాణాల్లో 10 మిల్లీ గ్రాముల నుంచి మొదలయ్యే యంత్రాలను వినియోగిస్తున్నారు. తద్వారా వినియోగదారులకు తూకాలు అర్థంకాకుండా మోసాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో 24 క్యారెట్ల బంగారు నగలు తీసుకున్న వారికి... వారివద్దనున్న నకిలీ యంత్రాలతో అవి 22 క్యారెట్లు బంగారు నగలని తెలుసుకోలేకపోతున్నారు. తూకాల్లో గ్రాము నుంచి 1.50 గ్రాముల వరకు బంగారాన్ని తక్కువ ఇస్తున్నట్లు సమాచారం. మోసాలకు పాల్పడుతున్న దుకాణాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు ఉదాసీనతతో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. దీంతో దుకాణదారులు ఆడిందే ఆట... పాడిందే పాటగా మారిందనడంలో సందేహం లేదు.

రాళ్ల బంగారంతో జర జాగ్రత్త...

చాలా మంది... రాళ్ల బంగారంపై ఎక్కువ మక్కువ చూపుతుంటారు. చేతి ఉంగరాలు, చైన్ లాకెట్‌లు, నక్లెస్ తదితరాలను రాళ్లతో తయారు చేయించుకుంటుంటారు. బంగారం ధర, స్టోన్ ధరల్లో చాలా వ్యత్యాసాలున్నాయి. కొంత మంది బంగారు దుకాణదారులు దీనిని క్యాష్ చేసుకుంటూ వినియోగదారులను మోసం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా రాళ్లతో ముడిపడిన బంగారు నగలను కొనుగోలు చేస్తే... బంగారం, రాళ్లను వేర్వేరుగా తూకం వేయాలి. వాటి ధరలను బిల్లుల్లో సైతం వేర్వేరుగా చూపించాల్సి ఉంటుంది. 10 గ్రాముల స్టోన్ కలిగిన ఉంగరం తీసుకుంటే... అందులో దాదాపు ఒక మిల్లీ గ్రాము స్టోన్ ఉంటే... కొందరు కేటుగాళ్లు మొత్తం 10 గ్రాములు బంగారం ధరకే అమ్మేస్తున్నట్లు సమాచారం.



తూనికలు, కొలతల శాఖ కార్యాలయం

వేయింగ్ మిషన్ల రెన్యువల్ సంగతేంటో..?

సాధారణంగా బంగారం దుకాణాలు నిర్వహిస్తున్న ప్రతిఒక్కరూ తమ వద్ద ఉన్న వేయింగ్ మిషన్లకు తూనికలు, కొలతల శాఖ నుంచి రెన్యువల్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకోవాలి. అధికారులు.. ఆ మిషన్‌ను పరిశీలించి తక్కువ తూకాలన్నా.. ఏదైనా సమస్యఉన్నా సరిచేసి, రెన్యువల్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. కొంతమంది ఆ శాఖ ఇచ్చే రెన్యువల్ సర్టిఫికెట్లను తీసుకోకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఎన్ని బంగారు దుకాణాలున్నాయి, ఎంతమంది రెన్యువల్ సర్టిఫికెట్లు తీసుకున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్ని బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల విషయానికొస్తే వారు ఆడిందే ఆట... పాడిందే పాట అన్న చందంగా తయారైందనే చెప్పాలి. ఫైనాన్స్ సంస్థల్లోకి బంగారు నగలను తాకట్టు పెట్టుకునేందుకు వెళ్తే... వారు వేసిన తూకం... ఇచ్చే డబ్బు తీసుకుని రావాల్సిందేనన్న బాధితులు వాపోతున్నారు. కొందరు ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకు నిర్వాహకులు వేయింగ్ మిషన్లలో తక్కువ తూకాలు నమోదు చేసుకుని, వినియోగదారులను మోసం చేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఆ ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులు, బంగారం దుకాణాల్లో వేయింగ్ మిషన్లకు రెన్యువల్ సర్టిఫికెట్లు తీసుకున్నారా, లేదా అని పరిశీలించాల్సిన తూనికలు, కొలతల శాఖాధికారులు పట్టించుకోవట్లేదన్నది బహిరంగ రహస్యమే. కార్యాలయానికి వచ్చిన వారికి మాత్రమే సర్టిఫికెట్లు జారీ చేస్తూ తమ పనైపోయిందని అధికారులు భావిస్తుండటంతో మోసాలకు అడ్డకట్ట వేయలేకపోతున్నారనడంలో సందేహం లేదు.



తూనికలు, కొలతల శాఖ కార్యాలయం వద్దకు వేయింగ్ మిషన్ల రెన్యువల్‌కు వచ్చిన నిర్వాహకులు (ఫైల్)

తనిఖీలు చేస్తున్నాం..

బంగారం దుకాణాల్లో నిత్యం తనిఖీలు చేస్తున్నాం. పలుచోట్ల షాపుల్లో బంగారం, స్టోన్ ధరలు సెపరేటుగా వేయకపోవడాన్ని గుర్తించి, జరిమానాలు విధించాం. ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. శాఖలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే.

-మహమ్మద్ గౌస్, ఇన్‌స్పెక్టర్, తూనికలు కొలతల శాఖ

ఎమ్మెల్సీ పదవిపై టెన్షన్... టెన్షన్..!

- ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యంపై సందేహాలు
- సామాజిక సమతౌల్యం ఒక్కటే ఆశావహం
- త్యాగాలు చేసినవారికి చాన్స్ ఇస్తారా..?
- అభ్యర్థుల ప్రకటన శనివారం..?











అనంతపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవులపై ఉమ్మడి జిల్లా టీడీపీ నేతలు ఆశలు పెట్టుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు కారణంగా సాధారణ ఎన్నికల్లో సీట్లను త్యాగం చేసిన నాయకులు పదవులను ఆశిస్తున్నారు. సామాజికవర్గ సమతుల్యం పాటిస్తే తమకే తప్పనిసరిగా పదవి దక్కుతుందని కొందరు అంచనా వేసుకుంటున్నారు. దశాబ్దాలుగా పార్టీ అభ్యున్నతి కోసం పాటుపడిన నేతలు సైతం ఎమ్మెల్సీ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఏ ప్రాతిపదికన ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయాలనే అంశంపై టీడీపీ అధిష్టానం కసరత్తు చేస్తోంది. జనసేన నుంచి నాగబాబును శాసనమండలికి పంపాలని ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. దీంతో జనసేనకు ఉమ్మడి జిల్లాలో అవకాశం లేదని తేలిపోయింది. టీడీపీ నుంచి ఎవరికి అవకాశం ఇస్తారనే చర్చ కొనసాగుతోంది. పార్టీ సీనియర్ నాయకులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, గుండుమల తిప్పేస్వామి, గడ్డం సుబ్రమణ్యం ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్న వారిలో ఉన్నారు. నియోజకవర్గాన్ని త్యాగం చేసిన నాయకుడిని పరిగణనలోకి తీసుకుంటే.. ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌కు అవకాశం ఉంటుంది. సామాజిక వర్గాన్ని పరిగణలోకి తీసుకుంటే బీసీ కోటాలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మైనార్టీ కోటాలో మాజీ ఎంపీ సైపుల్లా తనయుడు కేఎం జకీవుల్లాకు ఎమ్మెల్సీ పదవి దక్కే అవకాశాలుంటాయని ప్రచారం జోరుగా సాగుతోంది. టీడీపీ అధినాయకత్వంత తీవ్రంగా కసరత్తు చేస్తోందని పార్టీ ముఖ్య నాయకుల ద్వారా తెలిసింది. ఎమ్మెల్సీ పదవిని దక్కించుకునేందుకు ఆశావాహులు ఎవరిస్థాయిలో వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొందరు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబును పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ను కలిసి తమ అభ్యర్థిత్వాలను పరిశీలించాలని కోరినట్లు తెలిసింది.

ప్రాధాన్యం ఉంటుందా..?

సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గాలను రాష్ట్రంలోని 31 నియోజకవర్గాల నుంచి జనసేన, బీజేపీ అభ్యర్థులు పోటీ చేశారు. ఆ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు త్యాగాలు చేశారు. వీరికి మొదటి ప్రాధాన్యం ఇచ్చేలా ఉంటే.. ఉమ్మడి జిల్లాకు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవి దక్కే అవకాశం ఉంది. కష్టకాలంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేసిన నేతలకే ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలనే యోచనలో పార్టీ అధిష్టానం ఉండటం ఆశావాహులను మరింత కలవరపెడుతోంది. సామాజికవర్గాలను పరిగణలోకి తీసుకున్నా.. తమదాకా వస్తుందా అన్న అనుమానాలు ఆశావహుల్లో ఉన్నాయి. అయినప్పటికీ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

సామాజికంగానూ పోటీ..

టీడీపీ అధిష్టానం సామాజిక సమతౌల్యాన్ని పరిగణలోకి తీసుకుంటే ఉమ్మడి జిల్లాకు ఎమ్మెల్సీ పదవి దక్కే చాన్స్ ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయినా ఈ అంశం ఆశావహుల్లో ధైర్యాన్ని నింపడం లేదు. సామాజికవర్గాల పరంగా పదుల సంఖ్యలో ఎమ్మెల్సీ పదవి రేసులో ఉండటమే దీనికి కారణం. పార్టీ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు... సామాజికవర్గాల ఆశావహుల్లో బుద్దా వెంకన్న, బీద రవిచంద్ర, కొమ్మాలపాటి, దేవినేని ఉమ, రెడ్డి సుబ్రమణ్యం, ఏరాసు ప్రతాప్‌రెడ్డి, లింగారెడ్డి, జంగా కృష్ణమూర్తి పేర్లు వినిపిస్తున్నాయి. ఇదివరకూ ఎమ్మెల్సీలుగా పనిసిన బీటీ నాయుడు, పరిచూరి అశోక్‌బాబు మరో చాన్స్ ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నారు. మైనార్టీలలో విశాఖకు చెందిన మహమ్మద్ నజీర్ ఉన్నారు. ఇలా అన్ని సామాజికవర్గాల నుంచి ఇద్దరు ముగ్గురేసి నాయకులు ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు. ఆయా సామాజికవర్గాల్లోని నేతల మధ్య పోటీ నేపథ్యంలో ఏ సామాజికవర్గం నేతను ఎమ్మెల్సీ పదవి వరిస్తుందో తేలేందుకు 48 గంటలపాటు వేచి చూడాల్సిందే. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు శనివారం ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటిస్తారని తెలిసింది. దీంతో ఆశావహులలో టెన్షన్ మరింత పెరిగింది.

ఫైనాన్స్ సంస్థల వేధింపులు

భరించలేకున్నాం..

పోలీసులను ఆశ్రయించిన మహిళలు



పోలీసు స్టేషన్‌లో గోడు చెప్పుకుంటున్న బాధిత మహిళలు

సోమందేపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వేధింపులు భరించలేకపోతున్నామనీ, రక్షణ కల్పించాలని గురువారం బాధిత మహిళలు.. పోలీసులను ఆశ్రయించారు. మండల కేంద్రంలో చేనేత కార్మికులు అధికంగా నివసిస్తున్నారు. వీరి అవసరాలను ఆసరాగా చేసుకుని, ప్రైవేటు మైక్రో ఫైనాన్స్ సంస్థలు గ్రూపు ష్యూరిటీ పేరుతో 10వేల నుంచి రూ.40 వేలదాకా రుణాలిచ్చారు. పది మంది మహిళలను గ్రూపుగా చేసి, రుణాలు మంజూరు చేశారు. తర్వాత రుణాల వసూలు పేరుతో వేధిస్తున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పనులు లేవనీ, అప్పులు చెల్లించడానికి మూడు నెలలు గడువివ్వాలని కోరినా బాగేపల్లికి చెందిన ఫైనాన్స్ సంస్థ మేనేజర్ రంజిత్, ఉద్యోగి గంగరాజు ససేమిరా అంటున్నారని వాపోయారు. రుణం చెల్లించేందుకు గడువు ఇప్పించాలని పోలీసులను కోరారు. విషయం బయటకు పొక్కడంతో ఫైనాన్స్ సంస్థ దిగొచ్చింది. రెండు నెలలు మాత్రమే వ్యవధి ఇస్తామనీ, అప్పటికీ చెల్లించకపోతే ఇళ్లు జప్తు చేస్తామని బెదిరించినట్లు బాధిత మహిళలు శోభ, సుమతి, రాధ, మంజుల, ప్రమీళమ్మ, శాంతమ్మ, సాయిలక్ష్మి తెలిపారు. ఫైనాన్స్ సంస్థ ప్రతినిధుల ఒత్తిళ్లు భరించలేక కొందరు ఊరు వదిలి పారిపోయినట్లు వారు వాపోయారు. ఈ బెదిరింపులు ఇలా కొనసాగితే తమకు ఆత్మహత్యలే శరణ్యమని మహిళలు ఆవేదన చెందారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు ఏపీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్ విజయలత గురువారం ప్రకటనలో తెలిపారు. గుత్తి, నూతిమడుగు బాలుర గురుకులాలు, గార్లదిన్నె మైనార్టీ బాలుర వసతి పాఠశాలల్లో ఐదో తరగతిలో 80, ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో మిగిలిన సీట్లకు ఈనెల 31వ తేదీలోపు ఉమ్మడి జిల్లాలో అర్హతగల విద్యార్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆమె తెలిపారు.

కొడిగెనహళ్లిలో..

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి గురుకుల ప్రతిభా పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్‌ఎం, ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ మురళీధర్‌బాబు తెలిపారు. నెలాఖరులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 80 సీట్లకు రాయలసీమతోపాటు నెల్లూరు జిల్లాలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఏప్రిల్ 25న పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 8712625065 నంబరులో సంప్రదించాలన్నారు.

ఇంటర్మీడియట్ ప్రవేశానికి..

మడకశిర రూరల్: మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశానికి ఈనెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ రమాదేవి తెలిపారు. బాలికలకు టేకులోడు, గుడిబండ, బాలురకు గుండుమల, లేపాక్షి కళాశాలల్లో సీట్లు ఉన్నాయన్నారు.

ఆవుల కంటెయినర్ పట్టివేత



గాంధీ సర్కిల్ వద్ద నిలిపిన కంటైనర్ వాహనం

గుత్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నుంచి బెంగళూరుకు అక్రమంగా ఆవులను తరలిస్తున్న కంటెయినర్‌ను గుత్తి పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. పోలీసులు రాగానే డ్రైవర్, క్లీనర్ వాహనం వదిలి పారిపోయారు. మంత్రాలయం వైపు నుంచి బెంగళూరుకు కంటైనర్ వాహనంలో ఎద్దులు, ఆవులను తరలిస్తున్నట్లు వెనుక వాహనంలో వస్తున్న కర్నాటక వాసి అమృతజయరాం గమనించారు. డయల్ 100కు ఆమె సమాచారం ఇచ్చారు. గుత్తి పట్టణంలోకి కంటైనర్ రాగానే గాంధీ సర్కిల్ వద్ద ఆమె అడ్డుకున్నారు. వెంటనే పోలీసులు రావడంతో డ్రైవర్, క్లీనర్ పారిపోయారు. కంటైనర్‌లో దాదాపు 20 మూగజీవాలు ఉన్నట్లు సమాచారం. ఓ న్యూస్ చానల్ నిర్వాహకురాలైన అమృత జయరాం.. ఆవుల అక్రమ తరలింపుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకుడు తిమ్మారెడ్డి తదితరులు ఆమెకు మద్దతుగా సీఐ వెంకటేశ్వర్లును కలిశారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న అమృత జయరాం

అన్న హత్యకు తమ్ముడి సుపారీ

అన్న కొడుకుని కూడా చంపేయాలని ఒప్పందం

హత్యల కుట్ర భగ్నం

ఇద్దరు నిందితుల అరెస్టు

వేటకొడవళ్లు, నగదు స్వాధీనం



నిందితులతో పోలీసులు

రాయదుర్గం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆస్తి పంపకాల వివాదం, చెప్పుతో కొట్టారన్న అవమానంతో సొంత అన్న, అతడి కుమారుడిని హత్య చేసేందుకు తమ్ముడే సుపారీ ఇచ్చాడు. అడ్వాన్సు ఇవ్వడంతో పాటు హత్యకు అవసరమైన వాటిని సమకూర్చారు. దీనిపై ఉప్పందుకున్న రాయదుర్గం పోలీసులు.. హత్యల కుట్రను భగ్నం చేశారు. ఇద్దరు నిందితులతో పాటు వేటకొడవళ్లు, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం సాయంత్రం సీఐ జయనాయక్ స్థానిక స్టేషన్‌లో వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గ జిల్లా మొలకాల్మూరు తాలూకా కెరెకొండాపుర గ్రామానికి చెందిన మురారి దామోదర్‌గౌడ్, అతడి అన్న మధుసూదన్ గౌడ్ మధ్య ఆస్తి వివాదం ఉంది. తల్లిదండ్రుల ఆస్తి 12 ఎకరాల్లో నాలుగెకరాల తోటను మధుసూదన్‌కు, మరో నాలుగెకరాల వర్షాధార భూమిని అక్క సుస్మితకు, మిగిలినది దామోదర్ గౌడ్‌కు పంచారు. అలాగే మధుసూదన్‌కు తల్లి పేరుతో ఉన్న నాలుగు సెంట్ల స్థలంతోపాటు అందులో నిర్మించిన ఇంటిని కూడా వాటా కింద ఇచ్చారు. తండ్రి కర్ణాటకలోని రాంపుర గ్రామంలో ఎకరా భూమిలో ప్లాట్లు వేసి, అమ్మగా మిగిలిన వాటిలో నాలుగు ప్లాట్లు తల్లి పేరుతో ఉన్నాయి. వాటిలో దామోదర్‌గౌడ్ కాంప్లెక్స్ కట్టాలని నిర్ణయించుకున్నాడు. ఆ దిశగా అన్న మధుసూదన్ ఇంటికెళ్లగా.. వదిన సుగుణ, వారి కొడుకు భార్గవ్‌తో గొడవ జరిగింది. దీంతో దామోదర్ గౌడ్‌పై అన్నతో పాటు అతడి కుమారుడు, వదిన కలిసి చెప్పుతో దాడి చేసి, అవమానపరిచారు. దీనిని మనసులో పెట్టుకున్న దామోదర్‌గౌడ్ అన్న, అతడి కుమారుడిని చంపించాలనుకున్నాడు. అపుడు వారి ఆస్తి కూడా తనకు దక్కుతుందనుకున్నాడు.

రాయదుర్గం మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గొల్ల ఆదికేశవులు హత్యలో నిందితుడుగా ఉన్న మూడుముక్కల మారుతీరెడ్డిని దామోదర్ గౌడ్ సంప్రదించాడు. అన్న, అన్న కొడుకును హతమార్చేందుకు రూ.23 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. రూ.మూడు లక్షలు అడ్వాన్స్ కింద ముట్టజెప్పాడు. కుట్ర విషయం తెలుసుకున్న పోలీసులు పల్లేపల్లి గేటు వద్ద కారులో ఉన్న దామోదర్ గౌడ్, మారుతీరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. మధుసూదన్ గౌడ్, భార్గవ్‌ను కారులో కిడ్నాప్ చేసి, ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో చంపి, శవాలను పడేయాలని కుట్ర పన్నారు. అమలు చేసే ప్రయత్నంలో ఉండగా పోలీసులు భగ్నం చేశారు. నిందితుల నుంచి రూ.మూడు లక్షల నగదు, మూడు వేటకొడవళ్లు, రెండు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జయనాయక్ వివరించారు.

మార్కెట్‌కు 500 టన్నుల చీనీ దిగుబడులు

అనంతపురం రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లోని చీనీ మార్కెట్‌కు 500టన్నులకు పైగా చీనీ ఉత్పత్తులు వచ్చాయి. సీజన్ ప్రారంభంకావడంతో మార్కెట్‌కు కాయలు రావడం పెరుగుతోంది. బుధవారం 401టన్నుల కాయలు మార్కెట్‌కు రావడం జరిగింది. గురువారం కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు 572టన్నుల చీనీ కాయలు రావడం జరిగింది. అధికారులు ఈనామ్ పద్ధతిలో వేలం నిర్వహించారు. గరిష్ఠంగా టన్ను రూ.24,500, సరాసరి ధర రూ.14వేలు, కనిష్ఠ ధర రూ.7వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

ఆర్ఐ మున్వర్ సస్పెన్షన్

కదిరి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఓడీసీ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేక్ మున్వర్‌బాషాను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. గతంలో ఆయన కదిరి మండల ఆర్ఐగా పనిచేసినపుడు వివిధ భూ కుంభకోణాలతో సంబంధం ఉన్నట్లు కదిరి పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. దీంతో ఉన్నతాధికారులు ఆర్ఐ మున్వర్‌ను సస్పెండ్ చేస్తూ ఈనెల 4న ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ సమయంలో అధికారులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

బాధ భరించలేం..!

జిల్లా కేంద్రంలో కానరాని డయాలసిస్ సెంటర్

కిడ్నీ పేషెంట్లకు తప్పని అవస్థలు

దూర ప్రాంతాలకు వెళ్లి రావడానికి తీవ్ర ప్రయాస

పుట్టపర్తిలో ఏర్పాటు చేయాలంటున్న బాధితులు



పుట్టపర్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో డయాలసిస్ సెంటర్ లేకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఏర్పడి మూడేళ్లు గడిచినా డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయకపోవడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రం పరిసర మండలాల రోగులు ఇతర ప్రాంతాలకు డయాలసిస్ కోసం వెళ్లాల్సి వస్తోంది. ఇలా వారంలో మూడు రోజులు వెళ్లి రావడం చాలా ఇబ్బందిగా ఉందని, ఈకష్టం పగవాడికి కూడా వద్దని వారు వాపోతున్నారు. జిల్లాలో ధర్మవరం, హిందూపురం, కదిరి ఏరియా ఆస్పత్రులలో మాత్రమే డయాలసిస్ సెంటర్లు ఉన్నాయి. జిల్లా కేంద్రం, పక్క మండలాల్లో 50 మంది వరకు డయాలసిస్ పేషెంట్లు ఉన్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోనే 20 మంది వరకు పేషెంట్లు ఉంటున్నట్లు తెలిసింది. వీరిలో ఎక్కువ మంది కదిరి ఆస్పత్రికి వెళ్తున్నారు. జిల్లా కేంద్రంలోనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

భారంగా మారింది: ప్రభాకర్, కుమ్మరపేట, పుట్టపర్తి



కూల్‌డ్రింక్స్ అమ్ముకుంటూ కూల్‌గా సాగిపోతున్న నా జీవితంలో కిడ్నీల సమస్య పెనుభూతంగా మారింది. దీంతో బతుకు భారంగా మారింది. కూల్ డ్రిక్స్ కొనేవారు లేక ఆదాయం లేకుండా పోయింది. 60 ఏళ్ల వయస్సులో వారానికి మూడుసార్లు కదిరి ఆస్పత్రికి వెళ్లి డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తోంది. ఆస్పత్రికి బస్సులో వెళ్లిరావడం ఎంతో కష్టంగా ఉంది.

నాలుగేళ్లుగా..:

పాలగిరి రాజు, వెంగలమ్మచెరువు, పుట్టపర్తి మండలం



మార్కెటింగ్‌లో పనిచేస్తూ సాఫీగా సాగుతున్న జీవితంలో ఉన్నపలంగా కిడ్నీ సమస్య వచ్చింది. కిడ్నీలు రెండూ పాడైపోవడంతో జీవితంలో అంధకారం అలుముకుంది. నాలుగు సంవత్సరాలుగా వారానికి మూడుసార్లు కదిరి ఆస్పత్రిలో డయాలసిస్ చేసుకుంటున్నాం. రాను పోనూ చార్జీలతో కష్టంగా ఉంది. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తే మా కష్టాలు తీరుతాయి.

పింఛన్ సొమ్ము పెంచాలి:

తిరుపాలు, ప్రశాంతి గ్రామం, పుట్టపర్తి



కప్పలబండలో వాటర్‌మన్‌గా పనిచేస్తుండగా కిడ్నీల సమస్య వచ్చింది. దీంతో ఉద్యోగం పోయింది. పనిచేయలేను. నడవలేను. కడుపు నొప్పితో బాధపడుతున్నా. ఇల్లు గడవడం కష్టంగా మారింది. ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ రూ.10వేలు వారానికి మూడు సార్లు డయాలసిస్‌కు, మందులకు చాలడం లేదు. పింఛన్ సొమ్ము మరింత పెంచాలి.

వారానికి మూడుసార్లు: చిన్న అరుణమ్మ, పుట్టపర్తి



డయాలసిస్ కోసం వారానికి మూడుసార్లు 40 కిలోమీటర్ల దూరంలోని ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. అసలే రోగం.. ఆపై బస్సులో ప్రయాణంతో మరింత ఇబ్బందిగా ఉంది. 8నెలలుగా డయాలసిస్‌తో ఇబ్బంది పడుతున్నా. జిల్లా కేంద్రంలోనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తే కొంత బాధ తగ్గుతుంది.

ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో...

ఫైరోజ్ బేగం, డీంఅండ్‌హెచ్‌ఓ



జిల్లా కేంద్రంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ఒకప్రైవేటు సంస్థ ముందుకొచ్చింది. ఇందుకోసం ప్రయత్నాలు సాగుతున్నాయి. కొత్తచెరువులో నూతన భవనం నిర్మాణంలో ఉంది. భవనం పూర్తి అయిన వెంటనే డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదికలు పంపాం.

కంచేలు..!

- పొలాల్లో లేఅవుట్లు
- అనుమతులు లేకుండానే ప్లాట్ల విక్రయాలు
- ప్రభుత్వ ఖజానాకు భారీ గండి
- చోద్యంచూస్తున్న అధికారులు



నేమకల్లు గ్రామ సమీపాన పొలాల్లో వేసిన లేఅవుట్

బొమ్మనహాళ్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పంట చేలకు కంచెలు వేస్తున్నారు. లేఅవుట్లుగా మార్చి ప్లాట్లు విక్రయిస్తున్నారు. పంచాయతీ అప్రూవల్ తీసుకోకుండా, నిబంధనలకు తిలోదకాలిస్తూ రియల్టర్లు లేఅవుట్లు వేస్తున్నారు. వాటిని విక్రయించి, జేబులు నింపుకుంటున్నారు. రాజకీయ అండతోనే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ అనుమతులు తీసుకోకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. ఈ తంతు పబ్లిక్‌గానే సాగుతున్నా.. అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. బొమ్మనహాళ్ మండలం బళ్లారికి సమీపంలో ఉండడం, ప్రధాన రహదారికి పక్కనే ఉండడంతో ఈ ప్రాంతంలో భూములకు డిమాండ్ పెరిగింది. బళ్లారి, కణేకల్లు ప్రాంతాలకు చెందినవారు మండలంలో స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. దీనిని రియల్టర్లు సొమ్ము చేసుకుంటున్నారు.

నిబంధనలు తూచ్

గ్రామీణ ప్రాంతాల్లో అనధికారిక లేఅవుట్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. రియల్టర్లు అందులో నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్ల ఏర్పాటు, ఖాళీ స్థలాలు వదిలిపెట్టడం మానేస్తున్నారు. నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిలో ప్లాట్లు వేసి, విక్రయించాలంటే ముందుగా అనుమతులు తీసుకోవాలి. వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకోవాలి. పంచాయతీకి పన్నులు చెల్లించాలి. లేఅవుట్‌లో నిబంధనల మేరకే రోడ్లు ఏర్పాటు చేయాలి. ప్రజా అవసరాలకు ఖాళీ స్థలం సైతం వదలాల్సి ఉంటుంది. మండలంలోని ఉద్దేహాళ్, నేమకల్లు గ్రామాల పరిధిలో అనుమతులు లేకుండా లేఅవుట్లు వేశారు. ఉద్దేహాళ్ బాగా రద్దీ ఉండే గ్రామం కాగా.. నేమకల్లు ప్రసిద్ధిచెందిన ఆంజనేయస్వామి కొలువైన క్షేత్రం. ఈ నేపథ్యంలో రెండు గ్రామాల పరిధిలో స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. బళ్లారి, కణేకల్లు ప్రాంతాలకు చెందిన రియల్టర్లు మండలంలో భూములను కొనుగోలు చేసి, లేఅవుట్లుగా మార్చేస్తున్నారు. ఉద్దేహాళ్ ప్రధాన రహదారి పక్కనే రోడ్డుకు ఆనుకుని రాళ్ల పాతి లేఅవుట్ వేశారు. నేమకల్లు గ్రామంలో పంట భూమిని కొనుగోలు చేసి, ప్లాట్లు వేసి, విక్రయిస్తున్నారు. పంచాయతీ అధికారులకు ఈ వ్యాపారంపై తెలిసినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

రాజకీయ నాయకుల సిఫార్సులు, ఒత్తిళ్లతో గ్రామాల్లో అక్రమ లేఅవుట్లు వెలుస్తుండడంతో పంచాయతీ ఆదాయానికి భారీగా గండిపడుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతులులేని లేఅవుట్లలో ఇంటి స్థలాలు కొనుగోలు చేయడం ద్వారా భవిష్యత్తులో ఆయా పంచాయతీల ఆధ్వర్యంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉండదు. విద్యుత్ సౌకర్యం కూడా కల్పించరు.

చర్యలు తీసుకుంటాం

గ్రామీణ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఉద్దేహాళ్ గ్రామంలో లేఅవుట్లు వేసిన వ్యాపారికి నోటీసులు జారీ చేశాం. నేమకల్లు గ్రామంలో వేసినవారికి కూడా నోటీసులు పంపించి, పంచాయతీకి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

- దాస్, ఈఓపీఆర్డీ, బొమ్మనహాళ్



ఉద్దేహాళ్ గ్రామంలో వేసిన అనధికార లేఅవుట్

న్యూస్ బాక్స్..

బఫర్ స్టాక్ సమస్యను పరిష్కరించాలి

బత్తలపల్లి మార్చి 6(ఆంధ్రజ్యోతి): నెలలు గడుస్తున్న బఫర్ స్టాక్ సమస్య పరిష్కారం కాలేదని, దీంతో కార్డుదారులకు న్యాయం చేయలేకపోతున్నామని స్టోర్ డీలర్లు తహసీల్దార్ స్వర్ణలత వద్ద వాపోయారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వము ఏర్పడి తొమ్మిది నెలలు దాటినా బఫర్ స్టాక్ ఇవ్వలేదన్నారు. ప్రతి నెలా చాలా మంది కార్డుదారులుకు బియ్యం ఇవ్వలేక పోతుండటంతో వారు తమను తిడుతున్నారని వాపోయారు. డీలర్ల వద్ద ఉండే ఈపాస్ మిషన్లు, ఎండీయూ వాహనాలకు అనుసందానం చేశారని, దీంతో మండలంలో ఎన్ని ఎండీయూ వాహనాలు ఉంటే ఆ మిషన్లు మాత్రమే పని చేస్తున్నాయని, మిగిలిన పని చేయకపోవడంతో కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈపాస్ మిషన్లకు, ఎండీయూ అనుసందానం నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీలు రామక్రిష్ణ, శారద, డీలర్లు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ

ముదిగుబ్బ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొరిగల్లు పంచాయతీ అడవి బ్రాహ్మణపల్లి తండాలో భూములను ధర్మవరం ఆర్డీఓ మహేష్ గురువారం పరిశీలించారు. ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ గిరిజన భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారనే ఆరోపణ నేపథ్యంలో ఆర్డీఓ బుధవారం భూములను పరిశీలించారు. మళ్లీ గురువారం కూడా ఆ భూములను పరిశీలించారు. సాగులో ఎవరున్నారు.. ఆన్‌లైన్‌లో ఎవరి పేరు మీద ఉంది.. అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమగ్ర నివేదిక తయారు చేసి జిల్లా అధికారులకు పంపుతామని ఆర్డీఓ తెలిపారు.

రెవెన్యూ అర్జీలను 15లోపు పరిష్కరించాలి: జేసీ



పుట్టపర్తిటౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఈనెల 15లోపు పరిష్కరించాలని జేసీఅభిషేక్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల అర్జీలు, పీజీఆర్ఎస్ అర్జీలు, వెబ్‌ల్యాండ్, పెండింగ్ రికార్డులపై జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్, సర్వేయర్లతో జేసీ గురువారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను తహసీల్దార్లు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి, నాణ్యమైన సమాధానాలతో ఈనెల 15లోపు పరిష్కరించాలన్నారు. ఒకసారి వచ్చిన అర్జీ.. మరోసారి రాకుండా అర్జీదారులు సంతృప్తి పడేలా సమస్యను పరిష్కరించాలని సూచించారు. ప్రతి అర్జీని రికార్డులో నమోదు చేసి భద్రపరచాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై సమావేశం


మాట్లాడుతున్న డాక్టర్ జాన్సన్

పుట్టపర్తి రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయంపై జిల్లా స్థాయి సమన్వయకమిటీ సమావేశాన్ని స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో గురువారం నిర్వహించారు. అసోషియేట్ డైరక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ జాన్సన్, జిల్లావ్యవసాయాధికారి వైవీసుబ్బారావు, జిల్లా ఉద్యానవనశాఖాధికారి చంద్రశేఖర్, సీరికల్చర్ జిల్లా అధికారి పద్మమ్మ, జిల్లా ఫిషరీష్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరువాక కో-ఆర్డినేటర్ రామసుబ్బయ్య, డీఎల్సీసీ సభ్యులు కదిరి వ్యవసాయపరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ నరసింహులు, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

లింగ వివక్షను రూపుమాపుదాం


మాట్లాడుతున్న ఏపీ రెసిడెన్షియల్ కార్యదర్శి మస్తానయ్య

ఓబుళదేవరచెరువు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): లింగవివక్షత రూపుమాపాలని, అప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమని ఏపీ రెసిడెన్షియల్ కార్యదర్శి మస్తానయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక కస్తూరిబా పాఠశాలలో ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళ పోలీసులు, సీఆర్పీలకు లింగవివక్షతపై నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఓడీచెరువు మండలంలోనే అధికంగా బాల్యవివాహాలు జరుగుతున్నాయని, బాల్యవివాహాలు అరికట్టడానికి స్వచ్ఛంద సంస్థలు, ఐసీడీఎస్, అధికారులు ముందుకువచ్చి.. ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో లింగవివక్షత చూపుతున్న ఐదు మండలాలను గుర్తించామని, అందులో ఓడీసీ మండలం ఒకటని అన్నారు. కార్యక్రమంలో జీసీడీఓ సంపూర్ణ, ఎంపీడీఓ రాబర్టు విల్సన్, ఏపీఎంఓ మాలిక్, ఎంఈఓలు సురేష్ బాబు, రమణ, కస్తూరిబా ఎస్ఓ గీతాబాయి, ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అస్టింట్లు, మహిళ పోలీసులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

గాండ్లపెంట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని మండల విద్యాశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు గురువారం ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. లోకేష్ పాదయాత్రలో తమ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీలు నేటికి అమలు కాలేదని అన్నారు. హెచ్ఆర్‌సీ పాలసీ అమలు, ఎంటీఎస్, గ్రాజ్యువేటీ, ఉద్యోగ విరమణ అనంతరం వచ్చే బెనిఫిట్స్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు ఆంజి, రమేష్, దేవేంద్రరెడ్డి, భారతి, శకుంతల, మస్తాన్, ఆంజినాయక్ పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

ప్లంబర్లకు పట్టాల పంపిణీలో అక్రమాలు

వైసీపీ నాయకులు, నాటి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి: సీపీఐ


ఏఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ధర్మవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుట్టపర్తి ప్రధాన రహదారి పక్కన ఉన్న సర్వేనెంబరు 650లో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ చేయించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు కోరారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయ ఏఓ కతిజన్ కుబ్రా, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కు మార్‌కు గురువారం వినతిపత్రాలు అందజేసిన ఆయన మాట్లాడారు. గతంలో ప్లంబర్లకు భూమి కేటాయించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు ప్లంబర్స్ సంఘం నాయకులు, ఆ పార్టీ నాయకులతో కుమ్మక్కై తోటి ప్లంబర్లకే కుచ్చుటోపీ పెట్టారన్నారు. 650 సర్వేనెంబర్‌లో ప్లంబర్స్ అందరికి కావాలసినంత స్థలం ఉన్నప్పటికీ ప్లంబర్స్ యూనియన్ నాయకులు, వైసీపీ నాయకులు కుమ్మక్కై అందిన కాటికి దోచుకున్నారన్నారు. ప్లంబర్స్‌లో అర్హులకు మొండిచేయి చూపి వారిని వీధిన పడేలా చేశారని ఆరోపించారు. ప్లంబర్స్ యూనియన్ నాయకులు, కొందరు వైసీపీ నాయకులు ప్రధాన రోడ్డుకు అనుకుని ఉన్న విలువైన స్థలాలను నొక్కేయడంతో పాటు మిగిలిన స్థలాలన్నీ తమ వర్గీయులకే అందేలా చేసుకున్నారన్నారు. అంతేకాకుండా 2024 ఎన్నికల సమయంలో ధర్మవరానికి వచ్చిన తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్లు అప్పటి అధికార పార్టీతొత్తులుగా వ్యవహరించి.. ప్లంబర్లకు ఇచ్చిన స్థలాన్ని ముడుపులు తీసుకొని.. ఎవరికి పడితే వారికి పట్టాలు ఇచ్చారన్నారు. కోర్టులో ఉన్న కేసును కూడా పక్కదోవ పట్టించారన్నారు. ఈ అక్రమాలపై ఉన్నత స్థాయి అధికారులతో విచారణ చేపట్టి.. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టిరమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుడగ వెంకటనారాయణ, నాయకులు నాగభూషణ, పెద్దన్న, నారాయణ, నారాయణస్వామి ఉన్నారు.

సత్రం స్థలం కబ్జాకు యత్నం

స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన రెవెన్యూ అధికారులు

కదిరిఅర్బన్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): కదిరి మండలంలోని సున్నపుగుట్టతండాకు సమీపంలో సత్రం స్థలాన్ని కొందరు కబ్జా చేయడానికి కుట్రపన్నారు. ఆ స్థలంలో రాళ్లను కూడా పాతారు. స్థానికులు ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వీఆర్‌ఓ ఇనయతుల్లా, వీఆర్ఏలు చంద్ర, నాగభూషణం గురువారం ఆ సత్రం స్థలాన్ని పరిశీలించారు. నాటిన రాళ్లను పరిశీలించారు. గతంలో కదిరి లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం వచ్చే బాటసారుల కోసం సర్వేనెంబర్ 458-1లో సత్రం నిర్మించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. 458లోని 55 సెంట్లు భూమిని ఇతరులు కొనుగోలు చేశారు. అయితే రోడ్డుకు అనుకుని ఉన్న రెండు సెంట్ల సత్రం స్థలాన్ని కూడా కొనుగోలుదారులు భూమిలోకి కలుపుకోవడానికి ప్రయత్నించినట్లు చెప్పారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కదిరిఅర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరవాండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రం-2ను ఎంపీడీఓ పొలప్ప గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం సమయం దాటినా చిన్నారులకు భోజనం పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎక్కడికెళ్లిందని ఆయాను ప్రశ్నించారు. కార్యకర్త సెక్టారు సమావేశానికి వెళ్లినట్లు సమాధానమిచ్చారు. చిన్నారులు హాజరును నమోదు చేయకపోవడం ఏమిటని మండిపడ్డారు. ఆయనే అప్పటివరకు ఉన్న పిల్లలకు హాజరు నమోదు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శంకర్‌నాయుడు ఉన్నారు.

'అదానీ'తో పంటలు సర్వనాశనం: సీపీఎం


దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న సీపీఎం నేత రాంభూపాల్

తాడిమర్రి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల సరిహద్దులోని దాడితోట గ్రామం వద్ద అదానీ పవర్‌పాయింట్ నిర్మాణ పనుల వల్ల వస్తున్న దుమ్ము పడి దాడితోట గ్రామానికి చెందిన అరటి, చీనీ పంటలు సర్వనాశనం అవుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంభూపాల్, ఉమ్మడి జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న మండిపడ్డారు. గురువారం దాడితోట గ్రామ పొలాలను పరిశీలించారు. కొండను తవ్వి మట్టిని ఎత్తిపోయడం మూలంగా వస్తున్న దూళి తమ పొలాలపై పడి పంట పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు శ్రీనివాసరెడ్డి, అరవిందరెడ్డి, చిన్నసుబ్బిరెడ్డి వాపోయారు. చివరికి పంటకొనడానికి కూడా వ్యాపారులు ఎవరూ ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొండ పనులు ప్రారంభించినప్పటి నుంచి అదిగో ఇస్తామని, ఇదిగో ఇస్తామని చెప్పి ఇంతవరకు ఎవరికి పరిహారం ఇవ్వలేదన్నారు. రాంభూపాల్ మాట్లాడుతూ.. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అదానీ కంపెనీ ఇస్తుందా.. ప్రభుత్వం అందిస్తుందా అన్న విషయంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. వచ్చే సోమవారం లోపు అధికారులు, అదానీ ప్రతినిధులు నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయలని, లేకుంటే రైతులతో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లతామని అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఆ తర్వాత చిల్లకొండయ్యపల్లి గ్రామంలో రైతులతో మాట్లాడారు. అదానీ కంపెనీ వారు గుట్టలు పగలగొట్టేందుకు పేలుళ్ల మూలంగా బోర్లు పూడిపోతున్నాయని ఆ రైతులు వాపోయారు. భూగర్భ జలాలూ అడుగింటిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్ బాషా, మండల నాయకులు నారాయణ, నాగార్జున, ఆదినారాయణ పాల్గొన్నారు.

నిజాయతీతోనే గుర్తింపు: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి) పోలీసుశాఖలో విధులను క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకతతో నిర్వహించినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని ఎస్పీ వీ రత్న నూతన ప్రొబెషనరీ ఎస్ఐలకు సూచించారు. శిక్షణ పూర్తి చేసుకుని, జిల్లాకు వచ్చిన ప్రొబేషన్ ఎస్ఐలు... మర్యాదపూర్వకంగా ఎస్పీని గురువారం కలిశారు. ఎస్పీ మాట్లాడుతూ.. నూతన టెక్నాలజీ ఉపయోగించి జవాబుదారి తనంతో ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాసులు, ఏఓ సుజాత, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐలు మహేష్, వలి, ఆర్ఎస్సైలు వీరన్న, ప్రదీప్‌సింగ్, నూతన ప్రొబెషనరీ ఎస్ఐలు పాల్గొన్నారు.

జనజాగృతి సేవలు భేష్


జనజాగృతి బలరాంను సన్మానిస్తున్న ఎస్పీ

తనకల్లు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళ సాధికారిత అభివృద్ధికి, మహిళలలో చైతన్యం నింపడానికి జనజాగృతి సంస్థ మూడు దశాబ్దాలుగా తీవ్రంగా కృషి చేస్తోందని ఎస్పీ రత్న కొనియాడారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా పుట్టపర్తిలోని సాయిఆరామంలో మహిళల అభివృద్ధికి పాటుపడిన వారిని ఎస్పీ సన్మానించారు. అందులో భాగంగా జనజాగృతి సంస్థ అధ్యక్షుడు బలరాంను సన్మానించారు. ఈ సంస్థ తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, అమడగూరు, నల్లమాడ, ఓబుళదేరచెరువు, నంబులపూలకుంట, కదిరి, పెనుకొండ, రొద్దం, చెన్నైకొత్తపల్లి, పుట్టపర్తి, కొత్తచెరువు, సోమందెపల్లి, ముదిగుబ్బ, బుక్కపట్నం మండలాల్లోని మహిళల్లో చైతన్యం నింపడానికి కృషి చేసిందన్నారు.

ఇష్టానుసారంగా విద్యుత్ కోతలు: బీజేపీ

ముదిగుబ్బ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వేళాపాలా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర అగ్రికల్చర్ రీసెర్చ్ కో-కన్వీనర్ సోమల ప్రకాష్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక పాతవూరిలో ఆరు రోజులుగా విద్యుత్ కోతలు ఉన్నాయని, రాత్రి సమయంలో కోతలు మరీ ఎక్కువగా విధిస్తున్నారని అన్నారు. లోవోల్టేజ్ సమస్యతో బల్బులు వెలగడం లేదని.. ఫ్యాన్లు పని చేయడం లేదని, ఎలక్ట్రిక్ వస్తువులు కాలిపోతున్నాయని వాపోయారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్లు ఫోన్లు లిఫ్ట్ చేయడం లేదన్నారు. సిబ్బంది పనితీరుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు మాలపాటి రామకృష్ణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ధర్మవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థినులకు చట్టాలపై సీఐ రెడ్డప్ప గురువారం అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, చిన్నారులపై దాడులు, నేరాలు, సైబర్ నేరాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు.

● ముదిగుబ్బ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సీఐ శివరాముడు మహిళా చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విజేత విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బాబు నాయక్, జీవీ నరేష్, పీడీ రేఖ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: మండలంలోని రైయిన్‌బో పాఠశాల విద్యార్థినులకు పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది విధి విధానాలపై ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అవగాహన కల్పించారు. స్టేషన్ విధులు, ఉమెన్ హెల్ప్‌డెస్క్ విశిష్టతను, లాకప్, రికార్డులు, వీహెచ్ఎఫ్ సెంట్, డయల్ 100, మహిళ చట్టాలపై వివరించారు. ఇందులో కరస్పాండెంట్ జయసింహారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● తాడిమర్రి : స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులను పోలీస్‌స్టేషన్‌కు పిలుపించుకొని.. మహిళా చట్టాలు, బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై ఎస్ఐ క్రిష్ణవేణి అవగాహన కల్పించారు.

ఉపాధ్యాయుల బదిలీ చట్టం రూపొందించాలి

నంబులపూలకుంట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకొస్తున్న ఉపాధ్యాయుల బదిలీ చట్టం రూపకల్పనలో ఎవరికి అన్యాయం జరగకుండా పగడ్బందిగా చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోధనకు ఆటకం లేకుండా ఏటా వేసవిలో మాత్రమే బదిలీలు నిర్వహించేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. ఈచట్టం రూపొందించే క్రమంలో మేధావులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుల సంఘాల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి అందరికి ఆమోదయోగ్యమైన చట్టం తీసుకురావాలన్నారు. కర్ణాటకలో ఎప్పటి నుంచో అమలవుతున్న ఉపాధ్యాయుల చట్టాన్ని పరిశీలించి, అందులో ఉపయుక్తమైన వాటిని చట్టంలో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి, సందీప్, షఫీ, గోవర్ధన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రమణయ్య, రామమోహన్, లాలుసాబ్, జ్యోతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు భూముల విరాళం

కదిరిఅర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొటుకుపల్లి గ్రామంలోకి వెళ్లే రోడ్డు విస్తరణకు రైతులు భూములను విరాళంగా ఔదార్యం చాటుకున్నారు. ఆ గ్రామానికి చెందిన పెద్దమర్ల సుధాకర్, పెద్దమర్ల నారాయణ, బెస్త వెంకటరమణ రోడ్డు విస్తరణ కోసం తమ భూమిలోని పది అడుగుల వెడల్పు... 405 అడగుల పొడవు భూమిని విరాళంగా ఇచ్చారు. జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఈ భూముల బహిరంగ మార్కెట్‌లో చాలా విలువ ఉంది. అయినా ఆ భూములను విరళంగా ఇవ్వడంతో వారిని ఆ గ్రామస్థులు అభినందించారు. ప్రసుత్తం ఆ రోడ్డును గ్రామస్థులు మట్టితో చదును చేసుకున్నారు.


చదును చేసిన రోడ్డు

క్రైం న్యూస్...

అడవి పందులతో పంటల నాశనం


దెబ్బతిన్న మొక్కజొన్న పంట

తనకల్లు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురమాలపల్లి గ్రామ రైతు సుధాకర్‌రెడ్డి సాగుచేసిన మొక్కజొన్నతోట బుధవారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. బాధితుడు మాట్లాడుతూ.. రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశానని, బుధవారం రాత్రి ఆలస్యంగా పొలానికి వెళ్లానని, అప్పటికే అడవిపందులు ఎకరం మొక్కజొన్న పంటను నాశనం చేశాయని వాపోయారు. దీంతో రూ.రెండు లక్షలకుపైగా నష్టం జరిగిందన్నారు. అప్పులు చేసి పంట సాగుచేస్తే జింకలు, నెమళ్ల, అడవి పందులు పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం అడవి జంతువుల బారి నుంచి పంటలను రక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నాశనమైన ఆ పొలాన్ని ఎంపీఈఓ కీర్తన పరిశీలించారని, నష్టాన్ని అంచనావేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఏఓ శ్రీహరినాయక్ తెలిపారు.

మామిడిచెట్లు ఆహుతి


ఆహుతైన మామిడితోట

పుట్టపర్తి రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): చిత్రావతి నదీపరివాహక ప్రాంతంలోని కొండకు బుధవారం రాత్రి కొందరు ఆకతాయిలు నిప్పుపెట్టారు. ఆ మంటలు సమీపంలోని మండలంలోని పెడపల్లి గ్రామానికి చెందిన రైతు చంద్రాయుడికి చెందిన మామిడితోటకు వ్యాపించాయి. మూడు ఎకరాల్లో సాగుచేసిన సుమారు వంద మామిడి చెట్లు, స్ప్రింక్లర్లు, పైపులు, సర్వీసు వైరు కాలిబూడిదయ్యాయి. నష్టపోయిన తనను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

వ్యవసాయ పరికరాలు...



ఆహుతైన పైపులు, స్టార్టర్

బుక్కపట్నం, మార్చి6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపురం గ్రామసమీపంలోని కొండకు గురువారం ఆకతాయిలు నిప్పు పెట్టారు. మంటలు కొండ సమీపంలోని మహిళారైతు దాదారెడ్డి లక్ష్మీదేవమ్మ పొలానికి వ్యాపించాయి. దీంతో పొలంలోని మూడు విద్యుత్ స్టార్టర్ పెట్టెలు దగ్ధమయ్యాయి. అలాగే పొలంలోని డ్రిప్, స్పింకర్లు, పైపులు, వరి గడివామి పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఈప్రమాదంలో రూ.లక్ష నష్టం జరిగిందని బాధిత మహిళ రైతు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కదిరిఅర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళసముద్రంలో గురువారం పాల వ్యాన్‌ను, మినీ వ్యాన్ ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. అవుట్ పోస్టు పోలీసులు ఇచ్చిన వివరాల మేరకు... కదిరికి చెందిన నాగేంద్ర ఓ పాల కంపెనీలో సెల్స్ మన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం పాలను దుకాణాలకు వేయడానికి కాళసముద్రం వెళ్లాడు. రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపి.. దుకాణాలకు పాలు ఇస్తుండగా, అనంతపురం నుంచి కదిరికి వస్తున్న మినీవ్యాన్ పాల వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీవ్యాన్ పాల వ్యాన్ డ్రైవర్ నాగేంద్ర తలకు గాయాలయ్యాయి. పాల వ్యాను వెనక వైపున ఉన్న అదే గ్రామానికి అంకమ్మ తలకు, చేతికి గాయాలయ్యాయి. వారిని కదిరి ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

ధర్మవరంరూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎరువులు, రసాయనిక మందులు ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తే ఆ షాపులపై చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు హెచ్చరించారు. గురువారం స్థానిక ఎన్‌జీఓ కార్యాలయ సమావేశభవనంలో ధర్మవరం డివిజన్‌లోని ఎరువుల దుకాణాదారులు, డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విక్రయించిన ఎరువులు, మందులకు వెంటనే రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. రైతులకు అవసరమైన మేరకు మాత్రమే పురుగు మందులు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సనావుల్లా, ధర్మవరం ఏడీఏ జీ.క్రిష్ణయ్య, ఏఓలు ముస్తఫా, ఉదయ్‌కుమార్, ఓబిరెడ్డి, రమాదేవి, కృష్ణకుమారి, కవిత, ఆత్మ బీటీఎం ప్రతిభా పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న ఫర్వీన్‌బాను

కదిరి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్‌మే రీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘ నంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ మైనార్టీ రాష్ట్రనాయకులు పర్వీనాబాను హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు ఆగస్టియన్ సిస్టర్ మేర్సి, ఎవిలియన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ఎండ్లబండ్ల పోటీలు

గోరంట్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరావులపల్లి తండా సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద శ్రీరామనవమి రోజు జిల్లాస్థాయి ఎండ్లబండ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించనున్నట్లు సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు గంపల రమణారెడ్డి తెలిపారు. ఆలయ వ్యవస్థాపకులు శంకర్‌లాల్ నాయక్ ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో ప్రథమ విజేతకు రూ.లక్ష, ద్వితీయ రూ.70వేలు, తృతీయ రూ.50వేలు, నాలుగో బహుమతి రూ.40వేలు నగదు ఇస్తామని తెలిపారు.

న్యూస్ బాక్స్

వైభవంగా కొల్లాపురమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠ



కలశ స్థాపన చేస్తున్న అర్చకులు

అమరాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌడన కుంట గ్రామంలో గురువారం ఉదయం కొల్లాపురమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డీఆర్‌డీఏ పీడీ కె.ఎన్.నరసయ్య పాల్గొన్నారు. కొల్లాపురమ్మదేవికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి వేదపండితుల మధ్య హోమాలు చేసి, అమ్మవారి విగ్రహ, కలశ ప్రతిష్ఠాపన గావించారు. చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు సిద్దేశ్వరగౌడ్, గురుసిద్దప్ప, ఉగ్రనరసింహ, హనుమంతరాయప్ప, మాజీ సర్పంచ్ గోవిందప్ప, నాగప్ప పాల్గొన్నారు.

కట్టె మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ

అగళి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందరాజునపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కట్టె మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠను గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్ పాల్గొని పూజలు చేశారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అధిక సంఖ్యలో భక్తులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



మడకశిరటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మూడు రోజులపాటు స్వామివారి పుష్కర గోపుర కుంభాభిషేకం, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం స్వామివారికి వాస్తుహోమం, మహామంగళహారతి, సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, గోపుర కలశాల జలధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గుడిబండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దనకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో సరస్వతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. పదో తరగతిలో మంచి మార్కులు రావాలని విద్యార్థులు అమ్మవారిని మొక్కుకున్నారు. ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఎస్ఎంసీ చైర్మన్ వీరముద్దప్ప, షబ్బీర్, స్వామి, శ్రీనివాసమూర్తి, నాగప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రొళ్ల: మండలంలోని అలుపనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని మొక్కుకున్నారు. అనంతరం విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. దాతలు వెంకటేశ్వరరాజు, యజమాతరాజు, ఉపాధ్యాయులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యారంగం కుంటుపడింది



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు

హిందూపురం అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో దూసుకుపోతుందని, ఒక్క విద్యారంగంలో కుంటుపడిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు అన్నారు. గురువారం హిందూపురం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా పీజీ, కామన్‌సెట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించే దిశగా ఎందుకు ప్రభుత్వం ఆలోచించడంలేదని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అడ్డుగా ఉన్న జీఓ నం.77ను రద్దు చేయాలన్నారు. కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు పవన్, గోపి, జియత్, నూర్, మహ్మద్, భరత్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మంజువాణి

గుడిబండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డీఎంఅండ్‌హెచ్ఓ మంజువాణి, సీడీపీఓ శాంతలక్ష్మి, ఎంపీడీఓ గంగాధర్ అన్నారు. గురువారం మహిళా సాధికారత అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాలికలను లింగ వివక్ష లేకుండా పెంచి బాల్య వివాహాలను నిర్మూలించాలన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీదేవి, సూపర్‌వైజర్ కమలమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

షాపులు, హోటళ్లు రాత్రి 10.30 వరకు నిర్వహించుకోవచ్చు

హిందూపురం అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలో దుకాణాలు, హోటళ్లు రాత్రి 10.30 గంటల వరకు నిర్వహించుకోవచ్చని డీఎస్పీ కేవీ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ మాసంలో మాంసం హోటళ్లు, షాపులకు సమయాల్లో మార్పు చేశామన్నారు. కేవలం రంజాన్ మాసం వరకు మాత్రమే ఈ నిబంధనలు వర్తిస్తాయన్నారు.

బయటపడుతున్న అక్రమాలు

- మండల రెవెన్యూలో గందరగోళం
- రికార్డుల తారుమారుపై ప్రజల్లో ఆందోళన
- ఆరునెలల్లో విచ్చలవిడిగా అక్రమ మ్యుటేషన్లు
- అక్రమాలకు పాల్పడిన అధికారిపై వేటు



చిలమత్తూరు తహసీల్దార్ కార్యాలయం

చిలమత్తూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. మధురేపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు పదేళ్ల క్రితం 3.95 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. ఆయన పేరుతో కొనుగోలు చేసిన భూమిని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మ్యుటేషన్ చేయించలేదు. దాంతో పదేళ్లుగా కొనుగోలు చేసిన భూమిని తన అనుభవంలోకి తీసుకొని పంటలను సాగు చేసుకుంటూ వచ్చాడు. భూ యజమాని ఏడాది క్రితం మరణించాడు. దాంతో ఆ భూముని అతని ముగ్గురు కుమారులు సాగుచేసుకుంటూ ఉన్నారు. తండ్రిపోయిన తరువాత కొనుగోలు చేసిన భూమికి మ్యుటేషన్ చేయించకోవడానికి పలు దఫాలు స్థానిక రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగారు. అయినా వారికి న్యాయం జరగలేదు. కానీ అదే భూమిని గతంలో విక్రయించిన వారికే ఈ ఏడాది జనవరి నెలలో కొత్త మ్యుటేషన్ చేశాడు అక్రమాల అధికారి. కనీసం మ్యుటేషన్ చేసే సమయంలో సదరు భూమికి సంబంధించి ఈసీ, రిజిష్టర్ డాకుమెంట్, వారసత్వ ఆస్తి అయితే పూర్వీకుల నుంచి హక్కులు ఎలా సంక్రమించాయి, ఆ భూమికి సంబంధించి ఏవైనా లీగల్ సమస్యలు ఉన్నాయా? అనే విషయాలను పరిశీలించాల్సి ఉంది. కానీ ఇలాంటి విషయాలను ఏ ఒక్కటి పరిశీలనలోకి తీసుకోకుండానే తనకు ఇష్టం వచ్చినట్లు ఆస్థికి సంబంధం లేని వ్యక్తులకు మ్యుటేషన్ చేసేశారు. ఈ విషయం తెలుసుకున్న బాధితులు తమ భూమిని ఇతరుల పేరుతో మ్యుటేషన్ చేయడమేమిటని లబోదిబోమంటున్నారు. ఇలాంటి సంఘటనలు మండలంలో వందల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమాలన్నీ కేవలం ఆరు నెలల కాలంలో జరిగిపోయాయి. ప్రతి రోజు ఒకొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

రెవెన్యూ కార్యాలయంలో గందరగోళం: ప్రజల భూములకు సంబంధించి రికార్డులను సక్రమంగా ఉంచి భూ యజమానులకు రక్షణ కల్పించాల్సిన అధికారులే భూతగాదాలకు ఊతమిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భూముల విలువ పెరగడంతో పాటు ఉన్న భూములను ఎంతో భద్రంగా ఉంచుకుంటున్న తరుణంలో అక్రమ మార్గంలో ఒకరి భూములను మరొకరికి అవలీలంగా మార్చేస్తూ భూ యజమానులను గందరగోలంలో నెట్టేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్న అధికారి లెక్కలేని అక్రమాలకు తెరలేపారనేది ఒకొక్కటిగా బయటికి వస్తున్నాయి. ఎవరి భూమికి ఎవరు యజమాని అనేది తెలియని పరిస్థితి నెలకొంది.

రికార్డుల తారుమారుపై ఆందోళన: కొనుగోలు చేసిన భూములను వారసత్వంగా నమోదు చేసి మ్యుటేషన్లను ఇతరులకు ఇచ్చేస్తున్నారు. ఇటీవల చాగలేరు రెవెన్యూ పొలంలో కొనుగోలు చేసిన 23 ఎకరాల భూమిని ఏ మాత్రం సంబంధం లేని వ్యక్తుల పేరుతో వారసత్వంగా వచ్చిన ఆస్తి అంటూ మ్యుటేషన్ చేసేశారు. అలాగే తుమ్మలకుంటలో ఒక రైతు భూమిని మరొకరి పేరుతో మ్యుటేషన్ చేశారు. మ్యుటేషన్ చేసే విషయంలో కింది స్థాయి వీఆర్వో, ఆర్ఐ, డీటీల స్టేట్‌మెంట్లను కూడా పరిగణలోకి తీసుకున్న దాఖలాలు కనిపించలేదు. ఆయన పనిచేసిన ఆరు నెలల కాలంలో క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులు డమ్మీలుగా మారిపోయారు. దాంతో ఏ భూములకైనా అడిగినంత ఇచ్చుకున్న వారికి క్షణాల్లో వన్‌బీలను మార్చేశాడు. ఇటువంటి సంఘటనలు పెద్ద ఎత్తున బయటపడటంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది.

డీటీ యూనస్ బాబుపై సస్పెన్షన్ వేటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒకరి ఆస్తిని ఏమాత్రం సంబంధంలేని వ్యక్తుల పేరుతో వన్‌బీలు చేసిన విషయంపై 'ఆంధ్రజ్యోతి' గతనెల 1వ తేదీన రూ.6 కోట్ల భూమిపై వైసీపీ గద్ద, అక్రమంగా మ్యుటేషన్లు, అనే కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన కలెక్టర్ వెంటనే విచారణ చేపట్టారు. విచారణలో అప్పట్లో చిలమత్తూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న యునస్ బాబు అక్రమంగా మ్యుటేషన్లు చేసినట్లుగా నిర్ధారణ కావడంతో ఆయనను గురువారం సస్పెండ్ చేశారు.

గ్రంథాలయం పరిశీలన

అమరాపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా కార్యదర్శి రమ తనిఖీ చేశారు. రికార్డులను, భవనాన్ని పరిశీలించారు. వర్షాకాలంలో గ్రంథాలయం కారుతోందని, పుస్తకాలు తడిసిపోతున్నాయని స్థానికులు కార్యదర్శికి వివరించారు. గ్రంథాలయానికి రావాల్సిన బకాయిల కోసం అమరాపురం పంచాయతీ కార్యదర్శి సుధాకర్, మండల విస్తరణ అధికారి ఈఓఆర్‌డీ నాగమునిని కలిశారు. గ్రంథాలయ అధికారి ఇబ్రహీం, సిబ్బంది మారన్న పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

అగళి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలం ముత్తేపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు తనిఖీ చేశారు. పాఠశాలలో మౌలిక వసతులపై ఆరాతీశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. వేసవి ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ వెంట ప్రధానోపాధ్యాయుడు చిగురామప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు చిత్రలేఖనం పోటీలు

మడకశిర రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండుమలలో ఉన్న గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖన, చేతిరాత పోటీలు నిర్వహిస్తున్నాట్లు ఎంఈఓ భాస్కర్ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామన్నారు.

శ్రీరామనవమికి ఎండ్లబండ్ల పోటీలు

గోరంట్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరావులపల్లి తండా సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద శ్రీరామనవమి రోజు జిల్లాస్థాయి ఎండ్లబండ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించనున్నట్లు సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు గంపల రమణారెడ్డి తెలిపారు. ఆలయ వ్యవస్థాపకులు శంకర్‌లాల్ నాయక్ ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో ప్రథమ విజేతకు రూ.లక్ష, ద్వితీయ రూ.70వేలు, తృతీయ రూ.50వేలు, నాలుగో బహుమతి రూ.40వేలు నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలరైతులు పోటీలో పాల్గొన్నవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనేవారు ముందుగానే ఆలయ కమిటీ సభ్యుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షురాలిగా జయమ్మ

పావగడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మోగదాలబెట్ట పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షురాలిగా జయమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి జయమ్మ, ఉపాధ్యక్షురాలిగా రంగమ్మ నామినేషన్లు వేశారు. వీరికి పోటీ లేకపోవడంతో ఏగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సీడీఓ వెంకటేష్ ప్రకటించారు. వీరి ఎంపిక పట్ల డైరెక్టర్లు పార్వతమ్మ, గీతమ్మ, మీనాక్షి, వినోద్, కార్యదర్శి మంజుల, గ్రామ పంచాయతీ అధ్యక్షులు నరసింహప్ప హర్షం వ్యక్తం చేశారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన పది ప్రశ్న పత్రాలు

లేపాక్షి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలో జరగనున్న 10వ తరగతి పరీక్షల ప్రశ్నపత్రాలు గురువారం పోలీస్ స్టేషన్‌కు చేరాయి. ఎంఈఓ నాగరాజు నాయక్ మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాల మేరకు పదోతరగతి పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలు పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచినట్లు తెలిపారు.

రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

పెనుకొండ టౌన్/పెనుకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంత్రి సవిత ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ శ్రీరాములు తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కుట్టుమిషన్ల ట్రైనర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి సవిత పెనుకొండ నియోజకవర్గంలో 2500మంది మహిళలకు కుట్టుమిషన్లపై శిక్షణ ఇప్పించి వారికి ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వనున్నారు. 500 మంది మహిళలు 8న మంత్రి క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు తీసుకోవాలన్నారు. ట్రైనీ అనసూయమ్మ పాల్గొన్నారు.

కార్మికుడిని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్

హిందూపురం అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): హిందూపురానికి తాగునీరు అందించే గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, కమిషనర్ శ్రీనివాసులు అతనిని పరామర్శించారు. ఒప్పంద కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న అశోక్ సాంకేతిక పనులు పరిష్కరించే సమయంలో ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. అతడిని ఓ ప్రైవేట్ ఆసపత్రికి తరలించి చికిత్సలు అందించారు. తక్షణ సాయం కింది రూ.10 వేలు అందించారు. కౌన్సిలర్ సతీష్, నాయకులు నాగేంద్ర, ఇర్షాద్ పాల్గొన్నారు.

సైన్స్ పీబీఎల్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎంజేపీ పాఠశాల ఉపాధ్యాయులు

గుడిబండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు సైన్స్ పీబీఎల్ మేళాలో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ హెప్సిబా, ఎస్ఎంసీ చైర్మన్ సత్యనారాయణ వైస్ చైర్మన్ జగదీష్ తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న భారతిరెడ్డి, భానుప్రియ, 7వ తరగతి వర్షిత ప్రతిభను చాటారన్నారు. విజయవాడలో నిర్వహించిన మేళాలో మొదటి స్థానం సాధించారన్నారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

ఆక్రమణల తొలగింపు



మసీదు సర్కిల్‌లో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

గోరంట్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మసీదు సర్కిల్ ప్రాంతంలో చికెన్ దుకాణాల నిర్వాహకులు రోడ్లను ఆక్రమించడంతో వాటిని గురువారం అధికారులు తొలగించారు. మసీదు సర్కిల్ వద్ద చికెన్ దుకాణాలు ఎక్కువగా ఉండడంతో వారు ఆప్రాంతాన్ని అపరిశుభ్రం చేయడమేకుండా రహదారిని మొత్తం ఆక్రమించుకుని రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారు. రహదారిలో వెళ్తున్న ఆటోనిర్వాహకులకు చికెన్ వ్యాపారుల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో వారి ఫిర్యాదు మేరకు మంగళవారం పంచాయతీ ఈఓ సుబ్రహ్మణ్యం ఆప్రాంతాన్ని పరిశీలించి, ఆక్రమణలను తొలగించుకోవాలని, అపరిశుభ్రతను తొలగించాలని ఆదేశించారు. మాసం విక్రయదారులు ఆక్రమణలు తొలగించకపోవడంతో గురువారం స్థానికులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ మారుతి, వీఆర్వో అశోక్, ఎస్ఐ బాలాజీనాయక్ సిబ్బందితోపాటు పంచాయతీ కార్మికులను తీసుకెళ్లి చికెన్ దుకాణల వద్ద రహదారికి అడ్డంగా ఉంచిన రేకుల షెడ్లను, ఇతర సామగ్రిని తొలగించారు. చికెన్ దుకాణదారులు, స్థానికులు, పంచాయతీ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు రంగప్రవేశంచేసి ఆక్రమణలు తొలగించడానికి చర్యలు చేపట్టారు. ఆక్రమణలు తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పారదర్శకంగా విచారణ చేపట్టండి

- డీసీహెచ్‌కు బాధితుల వినతి



బాధితులను విచారిస్తున్న డీసీహెచ్ తిప్పేంద్రనాయక్

హిందూపురం అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అధిక రక్తస్రావంతో బాలింత ప్రీతి మృతి చెందిన ఘటనపై విచారణకు వచ్చిన శ్రీసత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డీసీహెచ్‌కు విచారణ పారదర్శకంగా నిర్వహించాలని మృతురాలి భర్త హరి కోరాడు. రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్, హెల్త్ సెక్రటరీ ఆదేశాల మేరకు గురువారం డీసీహెచ్ తిప్పేంద్రనాయక్ విచారణ అధికారిగా వచ్చారు. ఈ సందర్భంగా మృతురాలి భర్తను విచారించారు. జరిగిందంతా పూర్తిగా తెలియజేయడమే కాకుండా లిఖిత పూర్వకంగా కూడా ఇచ్చారు. బాధితుడు మాట్లాడుతూ.. విచారణను పారదర్శకంగా నిర్వహించాలని, నిర్లక్ష్యంగా వ్యవయహరించి తన బిడ్డలకు తల్లిని దూరంచేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తిప్పేంద్రనాయక్ మాట్లాడుతూ మృతురాలు ప్రీతి హిందూపురం ఆసుపత్రికి వచ్చిన సమయం నుంచి అనంతపురానికి రెఫర్ అయ్యే వరకూ అన్ని విషయాలు సేకరించామన్నారు. ప్రీతి కేస్‌షీట్ తెప్పించుకుని భద్రపరిచామన్నారు. తిరిగి కేస్ షీట్ మార్చకుండా జాగ్రత్తలు తీసుకున్నామనారు. అలాగే అనంతపురం జీజీహెచ్ నుంచి కూడా విషయాలు తెప్పించి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

మూడో వ్యక్తి గురించి గోప్యంగా విచారణ: ఆపరేషన్ థియేటర్‌లో వైద్యులు, అనస్తీషియా, ఎంఎన్ఓలు మాత్రమే ఉండాలి. మూడో వ్యక్తి వచ్చాడని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఆ విషయంపై బాధితుల వద్ద ఆధారాలు ఉన్నాయని, అయితే నాపై నమ్మకం ఉంటే మీరు నాకు ఇవ్వాలని, విచారణ గోప్యంగా చేస్తమని డీసీహెచ్ బాధితులను అడిగినట్లు సమాచారం. వారు నేరుగా కలెక్టర్‌కు ఇస్తామని చెప్పినట్లు తెలిసింది. వారు కలెక్టర్ వద్ద ఆధారాలు ఉంచితే గుర్తుతెలియని వ్యక్తి అనస్తీషియా ఇచ్చినట్లు ఆధారాలు రుజువైతే పరిస్థితి మరోలా ఉంటుందని వైద్యులు చర్చించుకోవడం కొసమెరుపు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేస్తున్న స్పెయిన్ బృందం, ఎంఈఓ

గోరంట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరేవాండ్లపల్లి ప్రాథమికొన్నత పాఠశాలలోని 65మంది విద్యార్థులకు ఆర్డీటీ ఆధ్వర్యంలో గురువారం సైకిళ్ల పంపిణీ చేశారు. పంపిణీకి ఆర్థికసాయం అందించిన స్పెయిన్ దేశస్థుల బృందం పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ జాన్‌రెడ్డెప్ప మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ వివిధరంగాల అభివృద్ధికోసం చేస్తున్న సేవలను కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పల్లెనుంచి విద్యార్థులు సకాలంలో పాఠశాలకు హాజరై బాగా చదివి తిరిగి స్వగ్రామంలోని ఇళ్లకు చేరేలా భద్రత కల్పించడానికి సైకిళ్లు పంపిణీ చేస్తోందన్నారు. స్పెయిన్ దేశానికి చెందిన బృందం 34మంది బాలికలు, 31మంది బాలురకు సైకిళ్లు అందించారు. ఆర్డీటీ ఏటీఎల్ నరసింగరావు, ఎస్‌టీఎల్ రాంప్రసాద్‌రెడ్డి, హెచ్‌ఎం అశోక్, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, రాధ, క్రిష్ణవేణి, కిషోర్, శ్రీదేవి పాల్గొన్నారు.

విలువలతో కూడుకున్నది.. న్యాయవాద వృత్తి

పెనుకొండ టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): న్యాయవాది వృత్తి వ్యాపార రంగం కాదని విలువలతో కూడిన బాధ్యత అని పెనుకొండ సీనియర్ సివిల్ న్యాయాధికారి టి. వాసుదేవన్ అన్నారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయాధికారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న జూనియర్ న్యాయవాద వృత్తి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న జూనియర్ న్యాయవాదులకు వృత్తిపరీక్షపై సూచనలు, సలహాలు అందించారు. ఆయన మాట్లాడుతూ నైతిక విలువలను పాటించి కక్షిదారులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ క్రమంలో వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేయాల్సి ఉంటుందన్నారు. సుసంపన్నమైన దేశం నిర్మించడంలో న్యాయవాదుల పాత్ర కీలకమన్నారు. ఏదైనా సలహాలు, సందేహాలుంటే నివృత్తి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి ముజీబ్, పసపల సయ్యద్ పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి మరమ్మతులు చేపట్టండి

అగళి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్సీకి మరమ్మతులు చేపట్టాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. 23సంవత్సరాల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే జలమయంగా మారుతోంది. దీంతో కార్యాలయంలో ఉన్న ఫర్నిచర్‌తోపాటు కంప్యూటర్లు పూర్తిగా తడిసిపోతున్నాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు దృష్టికూడా తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఇంత వరకు మరమ్మతులు చేపట్టలేదన్నారు.

పవన్ కల్యాణ్‌పై జగన్ ఆరోపణలు తగవు



మాట్లాడుతున్న జనసేన నాయకులు

పెనుకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా శ్రేయస్సుకోసం పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న జనసేన అధ్యక్షుడు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు జనసేన నాయకులు అన్నారు. గురువారం పార్టీ ఇన్చార్జ్ కుమార్ మాట్లాడుతూ పవన్‌కల్యాణ్‌ను జగన్మోహన్‌రెడ్డి, కార్పొరేటర్‌కు ఎక్కువ ఎమ్మెల్యేకు తక్కువ అని పేర్కొనడం ఆయన రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. ప్రజలు భారీ మెజార్టీ ఇవ్వడంవల్లే ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. మిమ్మల్ని రాష్ట్ర ప్రజలు ఛీకొట్టినా ప్రజలు వార్డుమెంబర్‌కు ఎక్కువ సర్పంచ్‌కు తక్కువ అని పేర్కొంటున్నారన్నారు. సంయుక్త కార్యదర్శి వెంకటేశ్, మండల కన్వీనర్ మహేష్, సోమందేపల్లి కన్వీనర్ జబీవుల్లా, రాజేష్, వెంకటేశ్, హరినాయక్, రవి, గంగాధర్, ఖాసీం, రమేష్, మంజునాథ్, శిరీషా, సుమిత్రరాయల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్‌కు గాయాలు

పెనుకొండ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిమడుగు ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమలనాయుడు గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మునిమడుగు గ్రామానికి చెందిన తిరుమలనాయుడు ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా సోలార్ కంపెనీవద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తిరుమలనాయుడుకు కాలు నుజ్జు నుజ్జయింది. స్థానికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్సల అనంతరం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కియ పోలీసులు తెలిపారు.

బావిలో పడి యువకుడి మృతి

గుడిబండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన భోజరాజు(23) అనే యువకుడు బావిలోపడి మృతి చెందినట్లు ఎస్ఐ రాజకుళ్లాయప్ప గురువారం తెలిపారు. భోజరాజు అనే యువకుడు బహిర్భూమికి వెళ్లి తాళికెర కిష్టప్ప బావిలో దిగి శుభ్రం చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడని, ఈత రాకపోవడంతో మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు గ్రామంలో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. బావిలోపడిన శవం తేలడంతో చుట్టుపక్కల పొలాల వారు గమనించి పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా భోజరాజుగా గుర్తించారు. బావిలోపడిన యువకుడిని బయటకు తీసి మడకశిర ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి తండ్రి కిష్టప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కిష్టప్ప పార్వతమ్మలకు ఇద్దరు కుమారులు, చిన్నకుమారుడు భోజరాజు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకొన్నాయి.

కర్ణాటక మద్యం స్వాధీనం

హిందూపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. కొల్లకుంటకు చెందిన వెంకటేశ్, కొడిగేపల్లికి చెందిన గిరీష్, గొల్లాపురం విజయలక్ష్మి, మేళాపురం లత, శ్రీలక్ష్మి కర్ణాటక నుంచి హిందూపురానికి మద్యం తీసుకొస్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. ఈ ప్రాంతాల్లో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి వీరి వద్ద నుంచి ఐదు బాక్సుల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదుచేసి నిందితులను కోర్టు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో మొబైల్‌స్క్వాడ్ సీఐ గురునాథ్‌రెడ్డి, ఎస్ఐలు పృథ్వీ, ఫరూక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పరిగి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గురువారం సీజ్ చేశారు. ఎస్ఐ రంగడు మాట్లాడుతూ శ్రీరంగరాజులపల్లి గ్రామ సమీపంలో జయమంగళి నది నుంచి కొడిగెనహళ్లి గ్రామానికి చెందిన కిరణ్ అనే వ్యక్తి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. వెంటనే స్పందించి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించామన్నారు.

లాడ్జిలో అగ్ని ప్రమాదం

పెనుకొండ టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దర్గాపేట సమీపంలో ఉన్న ఎస్ఎల్‌వీ లాడ్జిలో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. లాడ్జి కింద భాగంలో చిల్లర దుకాణం ఉంది. అక్కడి నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే వారు వచ్చి మంటలను అదుపుచేశారు. షార్ట్‌సర్క్యూట్‌వల్ల ఈ ప్రమాదం జరిగిందని సిబ్బంది తెలిపారు.